కార్మిక లోకం

మాసపత్రిక

సంచిక : 3 సంపుటి : 35 మార్చి - 2021 రూ. 10/-



'ఉక్కు' పిడికిలెత్తుదాం...



ఆప్కాస్ వద్దు - పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికుల సమ్మె













విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై నిరసన కార్యక్రమాలు









KRSA101M210

మార్చి - 2021

కార్మిక లోకం

సి.ఐ.టి.యు. ఆంధ్రప్రదేశ్ కమిటీ మాసపత్రిక

సంపుటి : 35
సంచిక : 3
విడి ప్రతి వెల : రూ. 10/-
సం॥ చందా : రూ. 100/-

విషయసూచిక

అడ్రస్ :
నండూరి ప్రసాదరావు భవన్,
24-24-14, రజకవీధి,
దుర్గాపురం, విజయవాడ-3
సెల్ : 9490098022 - 0866-2442988

సంపాదకీయం

పెట్రో మంటలతో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం..

దేశంలో పెట్రోల్, డీజిల్ లీటర్ ధర దాదాపు రూ.100కు చేరుతోంది. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో దాని దుష్ప్రభావం నిత్యావసర సరుకులతో పాటు అన్ని రంగాల పైన తీవ్రంగా ఉంటుంది. మోటార్ వెహికిల్స్, టాక్సీలు, ఆటోల పైన బతికే వారి పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. చమురుతో నడిచే చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన ఆయిల్ ధరలతో మూతబడుతున్నాయి. నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్ ధర ఫిబ్రవరిలో మూడు సార్లుగా రూ.100 పెంచారు. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.846 గా ఉంది. గతంలో ఉన్న సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.

కరోనా కాలంలో రవాణా రంగం స్తంభించడంతో చమురు ధరలు అన్ని దేశాల్లో తగ్గాయి. కానీ మన దేశంలో అంతర్జాతీయ ధరలకు విరుద్ధంగా సామాన్యుల నడ్డివిరిచే విధంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. ప్రపంచ ముడి చమురు (క్రూడ్ఆయిల్)పై పెట్రోల్, డీజిల్ ధరలు ఆధారపడి ఉంటాయి.


గత ఏడాది జనవరిలో ఒక బ్యారల్ చమురు ధర 64.31 డాలర్ల నుండి 57.79 డాలర్లకు తగ్గింది. మన దేశంలో మాత్రం దానికి భిన్నంగా పెట్రోల్, డీజిల్ పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం రూ.33 రాష్ట్ర ప్రభుత్వం రూ.33 నుండి రూ.40 వరకు వ్యాట్, డీలర్ కమీషన్ రూపంలో విధిస్తోంది.

పెట్రోల్, డీజిల్ మీద పన్నులు, సెస్సులూ తగ్గించి ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా చూడవచ్చుగదా! పైగా ప్రధాన మంత్రి ఇంకో కొత్త భాష్యం చెబుతున్నారు. ఇంధన ధరల పెరుగుదల పాత ప్రభుత్వాలే కారణమని అసంబద్ధంగా వాదిస్తున్నారు. 2014 ఏప్రిల్‌లో పెట్రోల్, డీజిల్ పై రూ.9.48, రూ.3.56 గా ఉన్న కేంద్ర ఎక్సైజ్ పన్నులను 2021 ఫిబ్రవరికి రూ.32.9, రూ.31.8కి పెంచటం కూడా పాత ప్రభుత్వాల పనేనా?


పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే నిత్యావసర ధరలు, రవాణా ఖర్చులు పెరుగుతాయి. కరోనా కారణంగా ఆర్థిక వ్యవస్థ క్షీణించింది. నిరుద్యోగం పెరిగింది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మోడీ జోడీ(అమిత్‌షా)కి కార్పొరేట్లు, పెట్టుబడిదారులు మినహా కోట్లాది సామాన్య ప్రజానీకం గోడు పట్టదు. ప్రజలపై ఎడా పెడా పన్నులు విధిస్తూ ధరలు పెంచుతూ మరో పక్క అదానీ, అంబానీలకు రూ. లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేయటమేగాక దేశ సహజ వనరులను అప్పనంగా కట్టబెడుతున్నారు. ఇంధన ధరలు పెరిగితే వస్తువులు తయారీ రంగం, నిర్మాణ రంగం, సేవా రంగాలతో సహా అన్నింటి ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీని వలన కుటుంబాల దేశ ఆర్థిక వ్యయంపై తీవ్ర భారం పడుతుంది.

మోడీ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను మేల్కొలపాలి. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల నియంత్రణకు ఐక్యంగా ఉద్యమించాలి.


బొమ్మలు చెప్పిన కథ



మిత్రోమ్ ... దిగులుగా ఉన్నావెందుకు ?
ఆర్థిక మాంద్యంతో నా ఉద్యోగం ఊడింది
बेरोजगारी
ఏంపర్లేదు రోజు రాత్రిపడుకోనే ముందు జై శ్రీరాం, వందేమాతరమని నామకోటి రాయి నీకు ఉద్యోగం లేదనే విషయాన్ని మర్చిపోతవు
???



పెట్రోలు ధర పెరుగుదలకు గత ప్రభుత్వాలదే బాధ్యత!
పెట్రోలు ధరలకు చమురు కంపెనీలదే బాధ్యత... మాది కాదు!
అంతా నీ కర్మదే బాధ్యత! అన్యులను నిందించతగదు! నాయనా!



LIC POLICY
LIC

కవిత


మరో చరిత్ర లిఖించేందుకు...

అక్కడ ప్రాణత్యాగాలు
ఉక్కు కర్మాగారమై
మొలకెత్తాయి...
బలిదానాలు
ఉత్తరాంధ్ర భుక్తికి
భరోసానిచ్చాయి
చెమట ఎర్రబడి అగ్నిగోళంలా
బ్లాస్ట్ ఫర్నేసిలో మరుగుతోంది
ఆంధ్రుల హక్కై సాగిన
విశాఖ ఉక్కు ఉద్యమం
విజయపతాకమై...
సగర్వంగా ఎగురుతోంది...
అదిగో
నిర్వాసితుల కన్నీళ్లతో తడిసి
ముత్యపు ముద్దయి
మెరిసిపోతున్న
విశాఖ ఉక్కు కర్మాగారం
అదిగో
రాబందులన్నీ ఒక్కచోటే చేరి...
ఎత్తుకు పోవాలని
కుట్రలకు బరితెగించాయి
ఆత్మ నిర్భయ భారత్
విదేశీ డేగల రెక్కల కింద
ఆంధ్రా కోడలితో కలిసి
విందారగిస్తుంది
నీలిసముద్రం
మరో మహా సంగ్రామానికి
తెరలేపింది
శ్రమజీవులు చీమల దండులా
కదులుతున్నారు...
ఘీంకార నాదాలు శ్రమ నామ
స్మరణంలా
మోగుతున్నాయి...
విశాఖ చిత్ర పటంపై
ఎర్రని మరో చరిత్ర
లిఖించేందుకు

- రెడ్డి శంకరరావు
94943 33511

మోయడమే 'దేశభక్తి'

అందిన కాడికి అమ్మకం
అమ్మినోడు దేశ ప్రధాని
అందుకున్నోడు అంబానీ
అతని తర్వాత అదానీ
అడుగున బడుగుప్రాణి
మోడీని ఎత్తితే దేశభక్తుడిని
అడిగితే ఆందోళన జీవిని



డాక్టర్... డాక్టర్...

ఆరోగ్యం

కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్ కార్డియాలాజీ డాక్టర్ నిశాంత్ గారి సలహాలు:

ప్రశ్న 1 : గుండె ఆరోగ్యానికి చెయ్యవలసిన పనులు ఏమిటి ?

జవాబు : 1) తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ప్రొటీన్స్, తక్కువ నూనె తీసుకోవాలి.

2) వారానికి కనీసం ఐదు రోజులు రోజుకు అరగంట చొప్పున నడక, లిఫ్ట్ ఎక్కడం మానడం, ఎక్కువ సేపు కూర్చోకుండా ఉండడం

3) ధూమపానం మానడం.

4) బరువు, బి.పి., షుగరు కంట్రోల్లో ఉంచుకోవడం.

ప్రశ్న 2. కొవ్వును కండగా మార్చుకోగలమా?

జవాబు : ఇది ప్రమాదకరమైన అపోహ! కొవ్వు, కండ వేరు వేరు కణజాలాలు. కొవ్వు అసహ్యకరం, ప్రమాదకరం. కొవ్వు కండగా మారదు.

ప్రశ్న 3 : ఆరోగ్యంగా కనిపించే వ్యక్తి కూడా ఒక్కోసారి హార్ట్ ఎటాక్‌కి గురవుతున్నాడు. ఇది ఆశ్చర్యం కదా! దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

జవాబు : దీనినే సైలెంట్ ఎటాక్ అంటారు. అందుకే 30 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తీ హెల్త్ చెకప్ చేయించుకోవాలి.

ప్రశ్న 4 : గుండెపోటు వంశ పారంపర్యమా?

జవాబు : అవును

ప్రశ్న 5 : గుండెపై ఒత్తిడి (స్ట్రెస్) ఎలా వస్తుంది? ఒత్తిడి తగ్గించుకోవడం ఎలా?

జవాబు : జీవితం పట్ల మీ వైఖరి మారాలి. ఏదీ పూర్తి పర్ఫెక్ట్‌గా ఉండక పోవచ్చు అనేది గుర్తుంచుకోవాలి.

ప్రశ్న 6 : ఆరోగ్యవంతమైన గుండె కోసం జాగింగ్, నడక.. ఈ రెండింటిలో ఏది ఉత్తమం?

జవాబు : నడక మంచిది. జాగింగ్‌లో జాయింట్స్ మీద ఒత్తిడి పెరిగి ప్రమాదం జరగవచ్చు.

ప్రశ్న 7: మీరు పేదలకు, అవసరమైన వారికీ సేవ చేస్తున్నారు. మీకు స్ఫూర్తి ఎవరు?

జవాబు : మదర్ థెరిసా!

ప్రశ్న 8: లో (low) బ్లడ్ ప్రెషర్ వారికి గుండె పోటు వచ్చే అవకాశం ఉందా?

జవాబు : చాలా తక్కువ

ప్రశ్న 9 : కొలెస్టరాల్ బాల్యం నుండే పోగుపడుతూ వస్తుందా? (నా వయసు 22). 30 సంవత్సరాల తర్వాత మాత్రమే దాని గురించి వర్రీ అవ్వాలా?

జవాబు : చిన్నతనం నుండే పేరుకుంటూ వస్తుంది.

ప్రశ్న 10 : అకాల భోజనాలు గుండె మీద ప్రభావం చూపిస్తాయా?

జవాబు : అకాల భోజనాల వల్ల జంక్ ఫుడ్ తింటారు. ఆ ఆహారం జీర్ణం కావడానికి ఊరవలసిన ఎంజైములు కన్ఫ్యూజ్ అవుతాయి.

ప్రశ్న 11: మందులు వాడకుండా కొలెస్టరాల్‌ను కంట్రోల్ చెయ్యడం ఎలా?

జవాబు : ఆహార నియంత్రణ, నడక, వాల్ నట్స్ తినడం ద్వారా.

ప్రశ్న 12: గుండె ఆరోగ్యానికి మంచి ఆహారం ఏది? చెడ్డ ఆహారం ఏది?

జవాబు : పళ్ళు, కాయగూరలూ మంచివి. నూనెలు చెడ్డవి.

ప్రశ్న 13: ఏ నూనె మంచిది? సన్ ఫ్లవర్, వేరుశనగ నూనె, ఆలివ్ ఆయిల్?

జవాబు : అన్ని నూనెలూ చెడ్డవే.

ప్రశ్న 14: ఏమేమి టెస్టులు చేయించుకోవాలి. ఏదైనా ప్రత్యేక టెస్ట్ ఉందా?

జవాబు : రొటీన్ షుగర్, బి.పి, కొలెస్టరాల్ చాలు. ఎకో టెస్ట్ చేయించుకుని ట్రెడ్ మిల్ చేయించుకోండి.

ప్రశ్న 15 : గుండె పోటు వచ్చిన వారికి చెయ్యవలసిన తక్షణ సహాయం ఏమిటి?

జవాబు : గుండె పోటు వచ్చిన వ్యక్తిని పడుకోబెట్టండి. ఒక ఆస్ప్రిన్ మాత్ర నాలుక కింద పెట్టండి. సోర్బిట్రేట్ మాత్ర అందుబాటులో ఉంటే అది కూడా పెట్టండి. వీలయినంత త్వరగా గుండె వ్యాధి నిపుణుడి దగ్గరకి తీసుకెళ్ళండి. మొదటి గంట లోపులోనే మరణం సంభవించే అవకాశాలు ఎక్కువ.

ప్రశ్న 16 : గ్యాస్ట్రిక్ నొప్పికీ - గుండె నొప్పికీ తేడా తెలుసుకోవడం ఎలా?

జవాబు : ఈ.సి.జీ చూస్తే గానీ చెప్పలేం.

ప్రశ్న 17 : యువకుల్లో వ్యాధులూ, హార్ట్ ఎటాక్‌లూ పెరగడానికి కారణం ఏమిటి? (30 - 40 మధ్య యువతలో హార్ట్ ఎటాక్ లు, గుండె వ్యాధులూ ఈ మధ్య ఎక్కువ అయ్యాయి.)

జవాబు : యువతలో అవేర్నెస్ పెరిగింది. అందువలన కేసులు కనిపిస్తున్నాయి. జీవన విధానం (బద్ధకం), జంక్ ఫుడ్, వ్యాయామం లేక పోవడం, పొగ తాగడం. మన దేశంలో జెనెటికల్‌గా అమెరికా యూరోప్ దేశాలతో పోలిస్తే గుండెపోటు అవకాశాలు 3 రెట్లు ఎక్కువ.

ప్రశ్న 18 : బి.పి 120/80 కంటే ఎక్కువగా ఉండి పూర్తి ఆరోగ్యంగా ఉండే వ్యక్తులు ఉంటారా?

జవాబు : ఉంటారు.

ప్రశ్న 19 : దగ్గర సంబంధాలు చేసుకోవడం వలన పిల్లలకు గుండె వ్యాధులు వచ్చే అవకాశం ఉంది అంటారు.

వాస్తవమా?

జవాబు : వాస్తవమే! దగ్గర సంబంధాల వలన కంజెనిటల్ ఎబ్నార్మాలిటీ ఉన్న పిల్లలు పుట్టవచ్చు.

వినిమయ ధరల సూచిక (బేస్ 2001=100) 2020

సెంటర్ సిరీస్	అక్టోబర్	నవంబర్	డిసెంబర్	జనవరి
ఆల్ ఇండియా	119.5	119.9	118.8	118.2
గుంటూరు	123	121.3	120.8	119.5
నెల్లూరు	115.3	116.0	116	115.6
విశాఖపట్నం	128.9	129.8	129.9	129.1
హైదరాబాద్	120.4	119.7	119.2	117.8
రాష్ట్ర సిరీస్	**మే**	**జూన్**	**జూలై**	**ఆగస్టు**
విజయనగరం	339	342	345	347
రాజమండ్రి/కాకినాడ	345	347	352	356
జగ్గయ్యపేట	363	367	370	373
తిరుపతి	324	327	331	332
ఏ.పి	324	327	330	332

లింకింగ్ ఫ్యాక్టర్	1971=100	1960=100	1982=100	2016=100
ఆల్ ఇండియా	-	4.93	4.63	2.88
హైదరాబాద్	-	5.23	4.79	2.44
గుంటూరు	-	5.60	4.57	2.61
విశాఖపట్నం	2.48	1.87	4.64	2.44
నెల్లూరు				
విజయవాడ	-	-	4.28	
విజయనగరం	-	-	3.93	
కాకినాడ	2.55	1.81	4.26	
జగ్గయ్యపేట	-	-	4.28	
తిరుపతి	-	-	4.57	

పాఠకులకు విజ్ఞప్తి

'కార్మికలోకం'పై మీ స్పందనను ఆహ్వానిస్తున్నాం. పత్రికలోని వ్యాసాలు, వార్తలు, వ్యాఖ్యలపై మీ అభిప్రాయాలు నిర్మొహమాటంగా రాసి పత్రిక అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. లేఖలతో పాటు తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కూడా పంపగలరు.

అడ్రస్ : నండూరి ప్రసాదరావు భవన్, 24-24-14, రజకవీధి,
దుర్గాపురం, విజయవాడ-520003.
ఫోన్ : 9490098022
e-mail : karmikalokam@gmail.com,

సర్క్యులేషన్ వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్:
9490098022
కొత్త చందాలు కట్టేవారు, పాతవి పునరుద్ధరించుకొనే వారు డబ్బును యూనియన్ బ్యాంక్, విజయవాడ పేరుతో పంపించగలరు.
Karmika Lokam A/c No. : 448802010000833
(IFSC : UBIN0534641), Governorpet Branch, Vijayawada.

రచయితలకు సూచన

'కార్మికలోకం' పత్రికకు రచనలను ఆహ్వానిస్తున్నాం. కార్మికుల జీవితానికి సంబంధించిన కథలు, కవితలు, వాస్తవ జీవిత చిత్రణలు పంపించొచ్చు. కార్మికులను కదిలించే వాటికి ప్రాధాన్యత. రచనలను 20వ తేదీలోపు 'కార్మికలోకం' మెయిల్ లేదా పోస్టల్ అడ్రెస్‌కు పంపించ మనవి.


- ఎడిటర్

మొండి బాకీల్లో భారత్ టాప్..!

- ఐఎంఎఫ్ నివేదిక

పార్లమెంట్‌లో చెప్పిన లెక్క ప్రకారం
మొండి బకాయిలు 13,30,000 కోట్లు..

ఎగవేత దారుల పేర్ల వెల్లడికి
నిరాకరించిన మోడీ సర్కార్..!




దేశస్థుల పౌరసత్వం
నిరూపించుకోవడం కాదు..
ఇలాంటి దొంగల నుంచి ప్రజాధనం
వసూలు కోసం చట్టం చేస్తావా??



దమ్ముందా మోడీ!!

భవిష్యత్తులో ఇలా వాడుకోవాలేమో?





పొయ్యినిలా   బండనిలా

వంట గ్యాస్ ధరలను రోజురోజుకూ పెంచేస్తున్న కేంద్ర ప్రభుత్వం

అచ్చే (చచ్చే) దిన్ వచ్చేసింది!


'ఉక్కు' పిడికిలెత్తుదాం...

- జె.అయోధ్యరామ్

విశాఖ ఉక్కు కర్మాగారం సాగర తీరాన వెలసిన పారిశ్రామిక మేలి మకుటం. రాష్ట్రానికే తలమానికం. ఉత్తరాంధ్ర మణిహారం. ఈ కర్మాగార సాధన కోసం ఎందరో మహానుభావులు అనేక త్యాగాలు చేశారు.

ఐదో సమగ్ర ఉక్కు కర్మాగారం నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ విశాఖపట్టణం అన్ని విధాలా అనువైన ప్రాంతంగా ఎంపిక చేసింది. అయినప్పటికీ అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నిధుల కొరత కారణంగా విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు సాధ్యం కాదని ప్రకటించారు. నిపుణుల కమిటీ సిఫార్సుతో ఆంధ్ర రాష్ట్రంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై ఎన్నో ఆశలు పెంచు కున్న ఆంధ్ర ప్రజానీకం ఆశలపై ప్రధాని ప్రకటన నీళ్లు చల్లింది. దీనితో ఆగ్రహంతో ఆంధ్ర ప్రజానీకం "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" అంటూ నినదించి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించారు. నిర్బంధాలను ఎదుర్కొని రాష్ట్ర ప్రజానీకం సాగించిన ఈ పోరాటంలో పోలీసు కాల్పుల్లో 32 మంది అమరులయ్యారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసగా 67 మంది వామపక్ష, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఏడుగురు వామపక్ష ఎం.పి లు తమ పదవులను రాజీనామా చేశారు. ప్రజా ఉద్యమానికి తలొగ్గిన ప్రధాని ఇందిరా గాంధీ విశాఖ పట్టణంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయనున్నట్లు 1970 ఏప్రిల్ 17న పార్లమెంట్లో ప్రకటించారు.

విశాఖ ఉక్కు కర్మాగారం నిర్మాణానికి 1971 జనవరి 20న విశాఖలో బాలచెరువు వద్ద ప్రధాని ఇందిరా గాంధీ శంకుస్థాపన చేశారు. పోరాటాలకు తలొగ్గి శంకుస్థాపన చేసినప్పటికీ నిధులు కేటాయించకుండా కాలయాపన చేశారు. 1977లో జనతా ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదటి సారిగా కర్మాగార నిర్మాణం కోసం రూ.1,000 కోట్లు నిధులు విడుదల చేసింది. భూసేకరణ పనులు ప్రారంభించారు. 64 గ్రామాల ప్రజలు 16,500 మంది నిర్వాసితులుగా మారారు. ఎకరా భూమికి



రూ.1,200 నుండి 1,800 నామమాత్రపు ధరకు 22 వేల ఎకరాల భూమిని విశాఖ ఉక్కు కర్మాగార నిర్మాణం కోసం త్యాగం చేశారు.

1979 జూన్ 12న సోవియట్ రష్యాతో భారత్ ప్రభుత్వం కర్మాగారం నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సహకారం కోసం ఒప్పందం కుదుర్చుకుంది.

సకాలంలో నిధులు విడుదల చేయక పోవడంతో, ప్రభుత్వం పూర్తిస్థాయి నిధులు సమకూర్చకపోవడంతో, నిర్మాణ వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి ఉత్పత్తి ప్రారంభించక ముందే అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారం పట్ల ఆది నుంచీ నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించినప్పటికీ అనేక ఒడిదుడుకులను, కష్టాలను అధిగమించి నిర్మాణం పూర్తి చేసుకుని 3.2 మిలియన్ టన్నుల ఉత్పత్తి దశకు చేరుకోగలిగింది. ప్రభుత్వం స్వంత గనులు కేటాయించక పోవడంతో మార్కెట్ ధరకు ముడి ఖనిజం కొనుక్కొని ఎన్నో కష్ట నష్టాలను అధిగమించి ఉద్యోగుల సమష్టి కృషితో ఉక్కు కర్మాగారం లాభాల బాటలో పయనించింది. ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారం పైన పెట్టిన పెట్టుబడి కేవలం రూ.4,890 కోట్లయితే దేశ ఖజానాకు అది పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ.45 వేల కోట్లకు పైగా చెల్లించింది. వివిధ ఆర్థిక సంస్థలకు రూ.13 వేల కోట్లకు పైగా వడ్డీ చెల్లించారు. తన స్వంత నిధులతో రూ.12,300 కోట్లను వెచ్చించి 3.2 మిలి యన్ టన్నుల నుండి 6.3 మిలియన్ టన్ను లకు విస్తరణ చేసుకోగలిగింది. మరో రూ.5 వేల కోట్లు వెచ్చించి 7.3 మిలియన్ టన్నులకు ఉత్పత్తి సామర్థ్యం పెంచుకుంది.

ప్రస్తుతం 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కర్మాగారమంటే సుమారు రూ. 30 వేల కోట్ల టర్నోవర్ స్థాయి కలిగిన కర్మాగారం. 35 వేల మందికి పైగా శాశ్వత ఉద్యోగులుగా ఉన్నారు. పరోక్షంగా మరో 30 వేల మంది ఈ కర్మాగారం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది విశాఖ ఉక్కు కర్మాగారం ద్వారా ఉపాధి పొందుతున్నారంటే 4 లక్షల మంది దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కల్పవృక్షం లాంటి ఈ కర్మాగారాన్ని అమ్మకానికి పెడుతున్నామని మోడీ సర్కార్ ప్రకటించడంతో ఆంధ్రరాష్ట్ర ప్రజలు తమపై అణుబాంబు పడినట్లు భావించారు. ఇది 50 సంవత్సరాల చరిత్ర కలిగిన కర్మాగారం. ఎందరో మహానుభావులు, ఆంధ్రరాష్ట్ర ప్రజానీకం చేసిన త్యాగాలు ఈ కర్మాగారంలో అంతర్భాగం.

సాగరతీరంలో, జాతీయ రహదారిని ఆనుకుని 22 వేల ఎకరాల భూ వసతి కలిగిన ఏకైక ఉక్కు కర్మాగారం ఇది. ఏ విధంగా చూసుకున్నా భూమి విలువే రూ.లక్షన్నర కోట్లకు పైగా ఉంటుంది. అనేక మౌలిక సదుపాయాలు, దేశవ్యాపిత మార్కెట్ నెట్‌వర్క్, విశాఖ బ్రాండ్ ఇమేజ్, మిషనరీ కలగలసి మరో లక్ష కోట్ల రూపాయల విలువతో రెండున్నర లక్షల కోట్లకు పైగా విలువగలిగినది మన విశాఖ ఉక్కు కర్మాగారం. ఇంత విలువైన కర్మాగారం 31.12.2020 నాటికి నికర విలువ రూ. 1,135 కోట్లుగా యాజమాన్యం, ప్రభుత్వం కాకి లెక్కలు వేస్తూ కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా ధారాదత్తం చేయడానికి పూనుకుంది. జనవరి 26న దేశ ప్రజలంతా రిపబ్లిక్ డే, రైతు ట్రాక్టర్ల పరేడ్లపై దృష్టి సారించగా చడీ చప్పుడు లేకుండా 'క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్'లో దీపమ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ ఎసెట్స్ మేనేజ్‌మెంట్ సిఫార్సుల ఆధారంగా కేబినెట్ "స్ట్రేటజిక్ సేల్ ఫర్ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్"కు ఆమోదం తెలిపింది. ఇది అక్షరాలా అత్యంత దుర్మార్గం, కుట్ర. ఈ కుట్రకు వ్యతిరేకంగా ఆంధ్ర రాష్ట్రం భగ్గున మండుతోంది. ఫిబ్రవరి 3న వందలాది మంది ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి స్టీల్‌ప్లాంట్ గేట్ ముందు నిరసన తెలియజేశారు. విశాఖ ఉక్కు కార్మిక సంఘాలు, అధికారుల సంఘాలు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్, ఓబీసీ ఉద్యోగుల అసోసియేషన్స్, ఇతర సంఘాలు అన్నీ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడి పోరాటానికి శ్రీకారం చుట్టాయి. ఫిబ్రవరి 5న వేలాది మంది ఉక్కు ఉద్యోగులు బైక్‌ర్యాలీ నిర్వహించి, విశాఖపట్టణం నగర నడిబొడ్డున జి.వి.ఎం.సి గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఫిబ్రవరి 12 నుండి రోజూ స్టీల్ ప్లాంట్ జంక్షన్ వద్ద హైవేను ఆనుకొని వందలాది మంది ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో వివిధ సంఘాల నుండి నాయకులు హాజరై సంఘీభావం తెలియజేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ రోజయిన ఫిబ్రవరి 18న యాజమాన్యం నిర్వహించే అధికారిక కార్యక్రమాలను బహిష్కరించి విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ దినంగా పాటిస్తూ వేలాది మంది ఉద్యోగులను, వారి కుటుంబ సభ్యులను సమీకరించి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆ సభకు అధికార వైసీపీ, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ, వామపక్షాలు సీపీఎం, సీపీఐతో పాటు కాంగ్రెస్, జనసేన పార్టీల రాష్ట్ర నాయకులు హాజరై ఈ ఉద్యమంలో భాగస్వాములవుతామని ప్రకటించడం హర్షించదగిన విషయం. ఇది పోరాట కమిటీ తొలి విజయంగా భావిస్తున్నాం. ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగించడం కోసం 26న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిం చాలని పోరాట కమిటీ నిర్ణయించింది. రాష్ట్రంలోని ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, కవులు, కళాకారులు, మేథావులు వేలాది మంది దీనికి మద్దతునిస్తూ 26న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలో పాల్గొన్నారు.



విశాఖ ఉక్కు నష్టాల్లో ఉందా? కారకులెవ్వరు?

స్వంత గనులు లేకుండా ముడి ఇనుప ఖనిజం, బొగ్గు మార్కెట్ ధరలకు కొని ఉత్పత్తి చేస్తున్న ఏకైక సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్. ముడి సరుకు కోసం టాటా స్టీల్ 28 శాతం, సెయిల్ 48 శాతం ఖర్చు చేస్తుంటే విశాఖ ఉక్కు 61 శాతం పైగా ఖర్చు చేస్తోంది. సెయిల్‌తో పోల్చినప్పుడు టన్ను స్టీల్ ఉత్పత్తికి రూ.4 వేలు పైగా ఖర్చు చేస్తోంది. దీనితో ఉత్పత్తి వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి మార్కెట్లో స్వంత గనులున్న కర్మాగారాలతో పోటీపడలేక అనివార్యంగా నష్టాల బారిన పడుతోంది. ప్రభుత్వం, ఉక్కు మంత్రిత్వ శాఖ, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు తమ నివేదికల్లో విశాఖ ఉక్కుకు స్వంత గనులు లేకపోవడమే ప్రధాన సమస్యగా అంగీకరించి కూడా ఉద్దేశపూర్వకంగా గనులు కేటాయించకుండా నష్టాల పాలు చేస్తున్నారు. మరో పక్క విదేశాల నుంచి చౌకగా స్టీల్ ఉత్పత్తులు డంప్ అవుతున్నాయి. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు చెయ్యకుండా విశాఖ ఉక్కుకు అడ్డుకట్టలేస్తున్నారు. వైవిధ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకురావడానికి ఉక్కు మంత్రిత్వశాఖ అనుమతి నిరాకరిస్తోంది. డిమాండ్ ఉన్న సీమ్‌లెస్ ట్యూబ్‌మిల్‌ను విస్తరణ ప్రణాళికలో అనుమతించకపోవడం నిక్కచ్చిగా ఓ కుట్ర. భారతదేశంలోని ఉక్కు పరిశ్రమ ఇబ్బందులకు ప్రధాన కారణం ప్రభుత్వ పన్నుల విధానం కారణమని నీతి ఆయోగ్ సభ్యుడు పద్మభూషణ్ వి.కె.సారస్వత్ పేర్కొన్నారు. సెస్‌లు, రాయల్టీలు, అధిక విద్యుత్ చార్జీలు, అధిక రవాణా, అధిక వడ్డీతో కూడిన రుణాలు ఉక్కు పరిశ్రమకు ప్రతిబంధకంగా తయారయ్యాయని ఆయన సోదాహరణగా పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ఖాతాలో జమ కావాల్సిన రూ.36 వేల కోట్లు ఇనుప ఖనిజం మార్కెట్ రేటుకు కొనుగోలు చేయడం వలన విశాఖ ఉక్కు కోల్పోయింది. రుణాలపై చెల్లించిన అధిక వడ్డీలు, స్వంత గనులు లేకపోవడం వలన విశాఖ ఉక్కు కోల్పోయిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే విశాఖ ఉక్కు లాభాల్లోనే ఉన్నదని ఇట్టే అర్థమవుతోంది. నష్టాలు అన్నవి

కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా రుద్దినవి తప్ప మరోటి కానే కాదు.

అయితే మోడీ ప్రభుత్వం చెప్పేది ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడమే తమ విధానమని నాలుగే నాలుగు ప్రభుత్వ రంగ సంస్థలను మినహాయించి మిగతావన్నీ అమ్మేస్తామని చెబుతున్నారు. ఇది ఏ విధంగా 'దేశభక్తి' అని అడుగుతున్నా. 50 సంవత్సరాల నుండి పెంచి పోషించుకున్న రూ.లక్షల కోట్లు విలువ చేసే కంపెనీని వారికి నచ్చిన తాబేదారులకు అమ్మేయడమేనా 'దేశభక్తి'? ప్రజల ఆస్తిని ఓ ప్రైవేటు వ్యక్తికి కట్టబెట్టడమే దేశభక్తా? విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నష్టాలు వస్తాయని వారు చెబుతున్నారు. నష్టాలనుకుంటే రూ.32 లక్షల కోట్లు ఆస్తులు, ఎసెట్స్ కలిగిన ఎల్ఐసిని ఏ నష్టాల పేరుతో అమ్మకానికి పెట్టారు? విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కావాలని మూడు దశాబ్దాలుగా అనేక రూపాల్లో ఆందోళనలు చేసినా ఎందుకు కేటాయించలేదు? విశాఖపట్టణం స్టీల్‌ప్లాంట్‌కు 11 బి గని కేటాయిస్తామని గతంలో ఒప్పందం చేసుకున్న ప్రభుత్వం ఎందుకు వెనక్కిపోయింది? ఈ రోజు ఇదే ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్ఎండీసీ నుండి వారి ఉత్పత్తి ఖర్చుకు 10 శాతమో, 20 శాతమో అదనంగా ఇచ్చి అటువంటి ఐరన్‌ఓర్ సరఫరా చేస్తామని చెప్పి మాటతప్పి మార్కెట్ రేటుకు కొనుక్కోమని చెప్పి రోడ్డు మీద వదిలిపెట్టిందీ ప్రభుత్వం అని ఈ రంగంలో అందరికీ తెలుసు.


ప్రభుత్వ రంగ బ్యాంకులు విశాఖ పట్టణం స్టీల్‌ప్లాంట్ నుండి 14.55 శాతం వడ్డీరేటును ఎందుకు వసూలు చేస్తున్నాయి? దీనికి ప్రభుత్వం ఎందుకు అడ్డుకట్టవేయడం లేదు? అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ విశాఖ స్టీల్‌ప్లాంటును నష్టాలబారిన నెట్టేసి ఆ సాకుతో తమ కిష్టమైన కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. ఈ కుట్రకు వ్యతిరేకంగా ఇప్పటికే ఉద్యమాలు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ జె.అయోధ్యరామ్, కో-కన్వీనర్‌గా గంధం వెంకట రమణ మరో కో-కన్వీనర్ జె.ఎస్.ఎన్.రావులు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.నర్సింగ రావు, మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ గార్లను చైర్మన్‌లుగా పెట్టి 35 మందితో ఒక పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యంలో ఉద్యమాలు జరుగు తున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకూ ఉద్యమం కొనసాగించాలని, ఆంధ్రరాష్ట్రానికి మణి హారంగా ఉన్న విశాఖ ఉక్కును కాపాడు కోవాలని రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న మద్దతును మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకుపోయేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలి.

మన గొంతు వినిపించేందుకు మన కోసం పోరాడేందుకు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి!



మొదటి ప్రాధాన్యత ఓటు **(1)** వేసి గెలిపించుకుందాం.



ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు మార్చిలో జరగ నున్నాయి. ఉభయగోదావరి జిల్లాల నుంచి యుటియఫ్ అధ్యక్షుడు షేక్ సాబ్జీ, కృష్ణా-గుంటూరు జిల్లాల నుంచి మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు గార్లు పిడిఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

శాసనమండలి ఏర్పడినప్పటి నుండి (2007) పీడీఎఫ్ మండలిలో ఒక విలక్ష ణమైన పక్షంగా వ్యవహరిస్తోంది. సుదీర్ఘమైన ఉద్యమ జీవితం, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పట్ల స్పష్టత, నికరంగా పోరా డటం, పాలక రాజకీయ ప్రలోభాలకు లొంగిపోని నిజాయితీ, తప్పనిసరి లక్షణా లుగా పీడీఎఫ్ సభ్యులు పని చేస్తున్నారు. మండలి లోనేగాదు బయటకూడా ఒక గౌరవం గుర్తింపు అన్ని పార్శ్వాల నుండి పొందారు.

పాలక పార్టీలతో సన్నిహితంగా వుంటే ఒప్పించి మెప్పించి సమస్యల్ని పరిష్కరించ వచ్చునని చాలామంది అభ్యర్థులు చెబుతుం టారు. అలా చెప్పి గెలిచిన వారు కూడా ఇద్దరు ముగ్గురు లేకపోలేదు. అది వొట్టిభ్రమ అని అనుభవం చెబుతోంది. నికరంగా పోరాడ్డం, నిర్మాణాత్మకంగా వ్యవహ రించడం, ఉద్యమాలతో మమైకం కావడం వల్లనే ఏ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అయినా తాను రాణించగలడు. టీచర్లకు, విద్యా రంగానికి ఉపయోగపడగలము. పిడిఎఫ్ సభ్యులు దీన్ని మనసావాచా నమ్మారు. అసిధారవ్రతంగా పాటించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా కూడా కోటీశ్వరులు నిలబడుతున్నారు. ప్రలోభాలు పెడుతున్నారు. సాధారణ రాజకీయ ఎన్ని కల స్థాయికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్ని దిగజార్చుతున్నారు. పలు రూపాల్లో టీచర్లను చీల్చుతున్నారు. పీడీఎఫ్ దీనికి పూర్తిగా భిన్నం, వ్యతిరేకం. సగటు టీచర్లే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు. ఎంతకాలం శాసనమండలి సభ్యులుగా వున్నా వారు సగటు టీచర్లలానే వున్నారు.

'జాతీయ నూతన విద్యా విధానం' మనం చిరకాలంగా పోరాడి సాధించుకొన్న హక్కు లన్నిటినీ ఒకవైపున హరిస్తోంది. ఇప్పటి దాకా బలమైన ఉపాధ్యాయ ఉద్యమం వున్నందు వల్లనే పాఠశాల విద్యారంగాన్న యినా ప్రభుత్వ రంగంలో కాపాడుకో గలిగాం. ఉన్నత విద్య ప్రైవేటుపరమై ప్రభుత్వ కాలేజీలు పోస్టులు భర్తీగాక వెలవెల బోతు న్నాయి. దీనికి తోడు అత్యంత నిరం కుశంగా పాలించడం, ఏకపక్ష నిర్ణయాలు చెయ్యడం, సంఘాలను ఉక్కు పాదంతో అణచెయ్యాలని చూడ్డం కొత్తగా మనం రాష్ట్రంలో చూస్తు న్నాము. ఇటీవలి బదిలీల్లో జరిగిన నిరం కుశ ధోరణి మనందరికీ తెలుసు. ఒకవైపు పేద పిల్లలు, మరోవైపు ఉపాధ్యాయులం ఇద్దరమూ తీవ్రంగా వీటితో నష్టపోతున్నాం. ఇప్పుడు కావల్సింది మన మధ్య ఐక్యత. సమరశీలత శాసనమండలి కూడా ఈ ఒరవడికి వేదిక కాగల్గితేనే సాఫల్యం.

శాసనమండలిలో పిడిఎఫ్ ఈ పాత్రను అత్యంత సమర్థవంతంగా పోషించింది. సంఖ్యాపరంగా వున్న బలంకూడా దీనికి మరింత తోడ్పడింది. ఇప్పుడు పోటీ చేస్తున్న అభ్యర్థులిద్దరూ పిడిఎఫ్ ప్రమాణాలకు నూరు శాతం తగినవారు. పోరాటాల్లో రాటుదేలిన వారు.

వీరి విజయం మన ఉద్యమాల విజ యం. భవిష్యత్ సవాళ్ళపై విజయం.

ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్

నిరుద్యోగం, ఉపాధి సమస్యలపై సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కార్యాచరణ సదస్సు

నిరుద్యోగం, ఉపాధి కోల్పోవడం, క్షీణిస్తున్న ఉద్యోగ నాణ్యతలపై సిఐటియు (కార్మికులు), డివైఎఫ్ఐ (యువత), ఎస్ఎఫ్ఐ (విద్యార్థులు) ఉమ్మడిగా 2021 ఫిబ్రవరి 2న న్యూఢిల్లీలో జాతీయ సదస్సు నిర్వహించాయి. అన్ని రాష్ట్రాల నుండి 300 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ మూడు సంఘాల అధ్యక్షులు కె. హేమలత, మహమ్మద్ రియాస్ మరియు వి.పి.సాను అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ మూడు సంఘాల ప్రధాన కార్యదర్శులుగా ఉన్న తపన్‌సేన్, అబయ్‌ముఖర్జీ, మయూఖ్ బిస్వాస్‌లు ముసాయిదా ప్రకటనను సదస్సు ముందు ఉంచారు. సదస్సులో 27 మంది ప్రతినిధులు ప్రకటనపై చర్చించారు. విలువయిన సూచనలు చేశారు. హేమలత తుది పలుకులతో సదస్సు ముగిసింది. (ప్రకటన విడిగా ఇవ్వబడుతుంది.)

సదస్సు కోర్కెలు:

1) నాణ్యమైన, శాశ్వత ఉద్యోగాల కల్పనకు అవసరమైన విధానాలు రూపొందించాలి.

2) సంక్షేమం, విద్యకు సంబంధించిన ప్రభుత్వ పథకాల్లో గౌరవ వేతనాల్లో పని చేసే వారిని, కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగులను, బాల కార్మిక స్కూళ్లలో పనిచేసే వారి సర్వీసులను పర్మినెంట్ చేయాలి.

3) ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ లకు బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయాలి.

4) ప్రభుత్వ, ప్రభుత్వ సంబంధిత ఉద్యోగాల్లో రిజర్వేషన్ నిబంధనలు అమలుచేయాలి. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి.

5) చట్టపరమైన చర్యల ద్వారా వారానికి 35 పని గంటలు, రోజుకి 4 పని షిఫ్టులను ప్రవేశపెట్టాలి.

6) బాల కార్మికుల పెరుగుదల సమస్యను పరిష్కరించాలి. ప్రభుత్వ సహాయంతో బాల కార్మికుల కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. బాల కార్మికుల పాఠశాలలను పటిష్టపరిచి, రెగ్యులర్ స్కూళ్లలో చేర్చే దానికి అవసరమైన విధంగా చర్యలు చేపట్టాలి.

7) మౌలిక సౌకర్యాల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం మొదలైన రంగాల్లో ప్రభుత్వ ఖర్చును, పెట్టుబడులను పెంచాలి.

8) పదవీ విరమణ వయసుకు ముందుగానే ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగులను నిర్బంధ పదవీ విరమణ చేయకూడదు.

9) ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడిదారులకు ప్రభుత్వ ఖర్చుతో ఇచ్చే రాయితీలను వారు నాణ్యమైన ఉపాధి కల్పించడానికి లింకు చేయాలి.

10) భద్రత లేని, గట్టితనం లేని ఉద్యోగాలకు వీలు కల్పించే విధానాలను రద్దు చేయాలి.

11) గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కుటుంబంలో ఒకరికి గాకుండా, ప్రతి ఒక్కరికీ అమలు చేయాలి. 200 రోజులు పని కల్పించి, రోజుకి రూ.600 వేతనమివ్వాలి. పట్టణాలకు విస్తరింప చేయాలి.

12) నెలకు రూ.5 వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలి. దానికి అవసరమైన చట్టపర చర్యలు తీసుకోవాలి.

13) అందరికీ ఉచిత నిర్బంధ విద్యను విశ్వవిద్యాలయ స్థాయి వరకు అందించాలి. ఇందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలి. చట్టపర చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాలి. అన్ని స్థాయిల్లో స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి.

14) రాజ్యాంగాన్ని సవరించి పని హక్కును ప్రాథమిక హక్కుగా చేయాలి.

ఈ కోర్కెలపై కార్మికులు, యువత, విద్యార్థుల్లో క్యాంపెయిన్ చేయాలి. నిరుద్యోగానికి, ఉపాధి కోల్పోవటానికి కారణమైన విధానాలను కింది స్థాయి వరకూ తీసుకెళ్లాలి. మొదటి దశలో ఈ కింది కార్యక్రమాలు చేయాలని సదస్సు పిలుపునిచ్చింది.


1) 2021 ఫిబ్రవరి లోపుగా రాష్ట్ర, జిల్లా స్థాయి ఉమ్మడి సదస్సులు జరపాలి.

2) అన్ని రాష్ట్రాల్లో కింది స్థాయి వరకు స్వతంత్రంగా, ఉమ్మడిగా విస్తృతంగ క్యాంపెయిన్ చేయాలి.

3) నిరుద్యోగ సమస్య ప్రభావాన్ని అర్థం చేసుకోటానికి సర్వే చేయాలి. ప్రచార సామాగ్రిని విస్తృతంగా పంచాలి. జాతాలు, ఊరేగింపులు, సమావేశాలు, ధర్నాలు చేయాలి.

4) రాష్ట్ర స్థాయి ధర్నా చేయాలి.

5) దేశస్థాయిలో ఉమ్మడి సమీకరణ.



నిరుద్యోగం, ఉద్యోగాల్లో కోత, దిగజారుతున్న పరిస్థితులపై

జాతీయ ఐక్య సదస్సు ప్రకటన

సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ లు సంయుక్తంగా ఫిబ్రవరి 2, 2021న ఢిల్లీలో జాతీయ సదస్సు జరిగింది. నానాటికి తీవ్రమవుతున్న నిరుద్యోగం, ఉద్యోగాల్లో కోత, దిగజారుతున్న వేతనాలు, పని పరిస్థితుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులు కార్మికులు, యువ జనులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉద్యోగార్థులతో సహా వివిధ తరగతుల ప్రజల జీవన జీవన పరిస్థితుల మీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారం పట్ల మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యపూరిత వైఖరిని అవలంబిస్తోంది. దీనిని జాతీయ సదస్సు తీవ్రంగా ఖండిస్తోంది.

మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు, 2020ను ఉపసంహరించుకోవాలని, రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధరను (యం.ఎస్.పి) గ్యారెంటీ చేస్తూ చట్టపరమైన రక్షణ కల్పించాలని, దేశంలో రైతాంగం చేస్తున్నా డిమాండ్లకు ఈ జాతీయ సదస్సు సంపూర్ణ మద్దతును తెలుపుతోంది. ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు వివిధ పద్ధతుల్లో కుట్రలు సాగించడం, దుష్ప్రచారం సాగించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ పాశవిక దాడులను ఎదిరించి సమైక్యంగా పోరాటం సాగిస్తున్న రైతాంగానికి, ప్రధానంగా ఢిల్లీ సరిహద్దులో సుదీర్ఘకాలంగా పట్టుదలతో నిరసనోద్యమాన్ని సాగిస్తున్న రైతాంగానికి సదస్సు సంపూర్ణ సంఘీభావం వ్యక్తం చేస్తోంద్. ఈ రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, అసువులు బాసిన రైతులకు సదస్సు జోహార్లర్పించింది.

మూడు వ్యవసాయ చట్టాలు, విద్యుత్ (సవరణ) బిల్లు 2020, రైతాంగ ప్రయోజనాలకు భంగం కల్గించడమేగాక, యావత్ ప్రజానీకం ప్రయోజనాలు ప్రధానంగా పేద, మధ్యతరగతి, శ్రామిక తరగతులకు చెందిన ప్రజల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కల్గిస్తాయి. కోవిడ్ -19 మహమ్మారి ప్రబలడం వల్ల ప్రజలు తీవ్ర ఇక్కట్లపాలు కావడంతో పాటు, దాని మూలంగా లాక్‌డౌన్‌లు విధింపబడడంతో షుమారు 40 కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికంలోకి నెట్టివేయబడ్డారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) అంచనా వేసిన నేపథ్యంలో ఈ చట్టాలు మనదేశ ప్రజల ఆహార భద్రతకు తీవ్ర ముప్పు తేనున్నాయి. విద్యుత్ (సవరణ) బిల్లు, 2020 ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం వల్ల, ప్రజాజీవనంలో అత్యంత అవసరమైన విద్యుచ్ఛక్తి ప్రజలు మోయలేని భారంకానుంది. ఈ మూడు రాక్షస వ్యవసాయ చట్టాలతో పాటు, విద్యుత్ (సవరణ) బిల్లు, 2020ను అమలు చేసినట్లయితే, దేశంలో ఉపాధి కల్పన అవకాశాలు మరింత దిగజారుతాయి.

రైతాంగం యొక్క జీవనాన్ని తీవ్ర వినాశనానికి గురిచేసే ఈ బిల్లును రద్దు చేయాల్సిందిగా, దేశవ్యాప్తంగా రైతాంగం చేస్తున్న అత్యంత న్యాయసమ్మతమైన డిమాండును ఆమోదించేందుకు మొండిగా నిరాకరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మిక్కిలి అహంకార పూరితంగా వ్యవహరించడమే కాక, రైతాంగాన్ని అప్రతిష్టపాలు చేయడానికి, ప్రజలను గందరగోళంపాలు చేయడానికి చేస్తున్న కుట్ర పూరిత చర్యలను సదస్సు తీవ్రంగా ఖండించింది.


విద్యా వ్యవస్థను ప్రైవేటీకరించి, కేంద్రం తన గుప్పెట్లో కేంద్రీకరించడం ద్వారా, ప్రజలందరూ విద్య నేర్చుకునే (సార్వత్రిక విద్య) హక్కును నిరాకరించే లక్ష్యంతో రూపొందించబడిన 'నూతన విద్యా విధానాన్ని' రద్దు చేయాలని సాగుతున్న పోరాటాలకు సదస్సు సంపూర్ణ మద్దతును తెలుపుతోంది.

నిరుద్యోగం

2008లో ప్రారంభమై, యావత్ ప్రపంచానే కుదిపేసి, నేటికీ కొనసాగుతున్న అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం కారణంగా నిరుద్యోగం ఇప్పటికే అత్యున్నత స్థాయికి చేరుకున్న వాస్తవాన్ని అనేక నివేదికలు ధృవీకరిస్తున్నాయి. లాక్ డౌన్ కారణంగా ఈ పరిస్థితులు మరింత దిగజారాయి.

దేశంలో నిరుద్యోగం 2020 నవంబర్ నెలలో ఉన్న 6.5 శాతం నుండి డిసెంబర్ నెలలో మూడు కోట్ల 87 లక్షల మంది అంటే 9.1 శాతానికి పెరిగిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీ.ఎం.ఐ.ఈ) సంస్థ 2021, జనవరి నివేదికలో పేర్కొంది.

పని చేయడానికి సిద్ధపడి, శ్రమ చేయగలిగిన వయస్సులో ఉన్న మొత్తం జనాభాలో లేబర్ మార్కెట్‌లో ఉద్యోగార్థులైన శ్రామిక శక్తిలో నిరుద్యోగుల శాతాన్ని, నిరుద్యోగ రేటు సూచిస్తుంది. ఎల్‌పీఆర్ (లేబర్ పార్టీసిపేషన్ రేట్) - శ్రమ చేయగలిగిన వయస్సులో ఉన్న మొత్తం జనాభాలో ఉద్యోగార్థులైన వారి శాతం లెక్కించడానికి, అనియత రంగంలో పనిచేసే శ్రామికులతో సహా, శ్రామిక విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగానే కాక, తక్కువ స్థాయి ఉద్యోగాలు చేసే వారితో సహా అన్ని రకాలుగా ఉపాధి పొందుతున్న వారందర్నీ పరిగణలోకి తీసుకోవడం జరుగుతున్నది. ఇది గత దశాబ్ధకాలంగా స్థంభించి పోవడమే కాగా తగ్గిపోవడం జరుగుతుంది. ఇది హఠాత్తుగా సంభవించిన పరిణామమో లేదా



ఒక్కసారి మాత్రమే జరిగినది కూడా కాదు. 2020 సంవత్సరంలో ఈఎల్‌పిఆర్ 40 శాతం కంటే కొద్దిగా ఎక్కువగా ఉన్నది. అంటే, అసలు ఉద్యోగాలే అందుబాటులో లేకపోవడంతో అనేక మంది వాటి కోసం ఎదురుచూడటం మానివేశారు. అంతేకాక, ఉపాధి కోసం ఎదురు తెన్నులు చూసే వారిలో కొద్ది మందికే ఉపాధి లభిస్తోంది.

శ్రామిక శక్తిలో యువజనుల శాతం నిరంతరం పడిపోవడంతో పాటు, మహిళల శాతం మరింతగా పడిపోవడం మిక్కిలి ఆందోళన కలిగిస్తోంది. అనేక అధ్యయనాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎమ్.ఎన్.ఆర్. ఈ.జి.ఎ) పనులకు నానాటికీ పెరుగుతున్న డిమాండ్‌ను చూస్తే, గ్రామీణ యువతిలో నానాటికి ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి హరించుకుపోవడాన్ని, పట్టణ ప్రాంతాల్లోని పరిశ్రమలు, సేవా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు హరించుకు పోవడాన్ని వెల్లడిస్తోంది.

2004-05 యువజనుల్లో నిరుద్యోగం రేటు మొత్తం మీద వయోజనుల్లో నిరుద్యోగం రేటు దాదాపు రెట్టింపుగా ఉంది. 2004 - 05 లో 5.4 శాతంగా ఉన్న నిరుద్యోగం రేటు 2017-18 నాటికి మూడు రెట్లు పెరిగి 17.8 శాతానికి చేరుకుంది. ఈ కాలంలోనే యువజనుల్లో ఉద్యోగాల్లోనూ (నీట్), విద్యాభ్యాసంలోనూ, ఏ విధమైన (వృత్తిపరమైన శిక్షణ) రేటు మూడు రెట్లకు పైగా పెరిగింది. మహిళల విషయంలో ఈ నీట్ రేటు పురుషుల్లో కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. ఇది మన సమాజంలో నెలకొని ఉన్న ఫ్యూడల్, పితృస్వామిక - సామాజిక, ఆర్థిక సంబంధాల ప్రాబల్యాన్ని సూచిస్తోంది. విద్యార్హతలు కలిగిన యువజనుల్లో నిరుద్యోగం రేటు ఎక్కువగా ఉండగా, పట్టభద్రులైన వారిలో కంటే సాంకేతిక (టెక్నికల్) విద్యలో డిప్లొమాగానీ, సర్టిఫికేట్ గాని కలిగిన వారిలో నిరుద్యోగం రేటు అత్యధిక స్థాయిలో ఉంది. విద్యావంతులైన యువజనుల్లో, ప్రధానంగా ఉన్నత విద్యను అభ్యసించిన యువకుల కంటే యువతుల్లో నిరుద్యోగం చాలా ఎక్కువగా ఉంది.

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీ.ఎం.కె.వీ.వై), నేషనల్ కెరీర్ సర్వీసెస్ వంటి పథకాలను ఎంతో ఆర్భాటంగా ప్రకటించడం జరిగింది. బీజేపీ ప్రభుత్వం నైపుణ్య భారతం (స్కిల్ ఇండియా), మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్ట్ అఫ్ ఇండియా వంటి పెద్ద పెద్ద నినాదాలిచ్చింది. అయితే, వీటి వల్ల యువతకు ఉద్యోగాలు కల్పించడం గానీ, గౌరవప్రదమైన పని పరిస్థితులు నెలకొల్పడం, లేదా వారి గౌరవప్రదమైన ఆదాయం సంపాదించుకునే అవకాశాలు కల్పించడం జరగలేదు.

ఉద్యోగాల్లో కోత

కల్పించబడే ఉద్యోగాల కంటే ఊడిపోయే ఉద్యోగాల సంఖ్య పెరిగి, నిరుద్యోగం తీవ్రం కావడంతో పాటు ఉద్యోగార్థుల అర్హతకు తగిన ఉద్యోగాలు (అండర్ ఎంప్లాయిమెంట్) కాక తక్కువ స్థాయి ఉద్యోగాలు తీవ్రంగా పెరిగింది. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభవ ప్రభావానికి తోడు, మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం నోట్ల రద్దు, జీఎస్టీ అమలు, కోవిడ్ - 19ను అదుపు చేయడం పేరిట అకస్మాత్తుగా దేశవ్యాప్త లాక్‌డౌన్ విధింపు వంటి నిర్ణయాల ద్వారా నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రతరం చేసింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు కారణంగా 90 శాతం మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న లక్షలాది పారిశ్రామిక సంస్థలు ప్రధానంగా చిన్న, మధ్యతరహా సంస్థలు, రిటైల్ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పెద్దనోట్ల రద్దు వల్ల దేశవ్యాప్తంగా 15 లక్షల మంది ఉపాధి కోల్పోయారు.

అజీజ్‌ప్రేమ్‌జీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఎంప్లాయిమెంట్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం, భారత దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా 2011-'12 నుండి 2017-'18 మధ్య కాలంలో 90 లక్షల ఉద్యోగాలు హరించుకుపోయాయి. అంటే, ఈ కాలంలో ఏడాదికి 26 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

లాక్‌డౌన్ మరియు అనంతర పరిస్థితులు

ప్రజలకు ఉపశమనం కలిగిం

చేందుకు సమర్ధవంతమైన చర్యలు చేపట్టకుండా జిల్లాల్లో లాక్‌డౌన్ విధించడం వల్ల శ్రమజీవుల జీవితాల్లో విషాదం అలముకుంది. కోట్లాది మంది ఉపాధి కోల్పోయి, జీవనాధారం కోల్పోయారు. ఈ పరిస్థితులు నిరుద్యోగ సమస్యను మరిన్ని రెట్లు తీవ్రతరం చేశాయి. లక్షలాది మంది వలస కార్మికులు, వారిలో అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న యువకార్మికులు, తమ ఉపాధి, ఆదాయాలు కోల్పోయి, తమ స్వస్థలాలకు వెళ్లేందుకు వేలాది కిలోమీటర్లు కాలినడకన పయణించిన దృశ్యాలు, దేశాన్ని, మొత్తం ప్రపంచాన్నే నివ్వెర పరిచాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం, వలస కార్మికుల ఉపాధి, ఆదాయాలను పరిరక్షించాలని, లాక్‌డౌన్ అమల్లో ఉన్న సమయంలో వలస కార్మికులను వారి నివాసాల నుండి ఖాళీ చేయించరాదని, వారు స్వస్థలాలకు వెళ్లడానికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్న డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం మొండిగా తిరస్కరించింది. ఈ పరిస్థితులు ఉపాధి మరింతగా దిగజారటానికి దారితీశాయి.

సీఎంఐఈ నివేదిక ప్రకారం 2020 సెప్టెంబర్ నుండి ప్రతినెలా ఉన్న ఉద్యోగాలు వూడిపోవడం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. 2020 నవంబర్, డిశంబర్ నెలల్లో 40లక్షల మంది ఉపాధి కోల్పోయారు. సిహెచ్ఐఇ ఇటీవల వేసిన అంచనా ప్రకారం కేవలం సంఘటిత రంగంలోనే కోటి 47 లక్షల మంది ఉద్యోగాలు పోయాయి. వీరిలో 95 లక్షల మంది గ్రేద్యుయేట్లు, పోస్ట్ గ్రాద్యుయేట్లు. మొత్తం లేబర్ మార్కెట్ (ఉద్యోగార్ధుల్లో వీరు దాదాపు 13%గా ఉన్నారు. బీఎస్ఎన్ఎల్ తదితర ప్రభుత్వరంగ సంస్థలు, కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రైల్వేలు తదితర సంస్థల్లో వలే వ్యయం తగ్గించటం సామర్ధ్యాన్ని మెరుగుపరచడం, అవినీతిని అరి కట్టటం, అన్ని రకాల సాకులు చూపి కేంద్ర ప్రభుత్వ తానే ఉద్యోగాల్లో కోత విదిస్తోంది. విద్య, వైద్యం, రైల్వేలు తదితర కీలక విభాగాలతో సహా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కొన్ని లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా వదిలివేయడం జరిగింది. ప్రభుత్వోద్యోగులు చేసే ఉద్యోగులను కార్యకలాపాలను పెద్ద ఎత్తున ఔట్‌సోర్సింగ్‌కు పూనుకుంది. ఇప్పటికే ఎస్‌టి, ఎస్‌సి, ఓబిసి తదితర తరగతులకు కేటాయించిన ఉద్యోగ ఖాళీలు (బ్యాక్‌లాగ్ పోస్టులు) భారీ స్థాయిలో ఉండగా ఈ తరగతుల ఉద్యోగార్ధులకు ఉద్యోగావకాశాలను తిరస్కరించడం జరుగుతోంది.

దిగజారుతున్న ఉద్యోగుల వేతనాలు, పనిపరిస్థితులు

కేవలం ఉద్యోగావకాశాలను లేకుండా చేయడం మాత్రమే కాక ఉన్న ఉద్యోగాలను వూడకొట్టటమే కాక పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు, పనిపరిస్థితులను(ఉద్యోగాల్లో నాణ్యత దారుణంగా దిగజార్చటం కొన సాగుతోంది. పారిశ్రామికాదిపత్య వర్గాలకు గరిష్ట స్థాయిలో లాభాలు కట్టబెట్టడం నయా ఉదారవాద విధానాల ప్రధాన లక్షణాలలో ఒకటి. పర్మినెంట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పడిపోతున్నాయి. కార్మికుల చేసే పనులలో అత్యధిక భాగం ప్రమాదభరితమైనవి. వీరికి ఏవిధమైన ఉద్యోగభద్రత కనీస ఆదాయం గ్యారంటీ సామాజిక భద్రతలేవు.

ఉద్యోగార్ధుల అర్హతకు తగిన ఉద్యోగాలు కాక తక్కువ స్థాయి ఉద్యోగాలు తీవ్రంగా పెరుగుతున్నట్లు ఈ అంశాలు సూచిస్తు న్నాయి. విదేశీ, స్వదేశీ కార్పొరేట్లు తమ వ్యాపారాలను ఏ విధమైన చట్ట పరమైన ఆటంకాలు లేకుండా నిర్వహించుకునే విధంగా (ఈజ్‌ఆఫ్ దూయింగ్ బిజినెస్) కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం సరళమైన లేదా సడలింపులతో కూడిన ఉద్యోగనియామకాల పద్దతులను ప్రోత్సహిస్తోంది. అంటే ఉద్యోగనియామకాల్లో కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా, యజమానులకు సానుకూల చర్యలు చేపట్టటం జరుగుతోంది. బీజెపి ప్రభుత్వం అప్రెంటిస్ చట్టాన్ని సవరించి, (ఎన్ఇఇఎం) మిషన్ - జాతీయ ఉద్యోగ నియామకాల పెంపుదల కార్యక్రమం, ఎన్ఇటిఎపి (నేషనల్‌ఎంప్లాయ్‌మెంట్ త్రూ అప్రెంటిస్ ప్రోగ్రాం) అప్రెంటీస్ విధానం ద్వారా నియామకాల ద్వారా జాతీయ విధానం వంటి పథకాలను ప్రవేశపెట్టింది. పెద్ద ఎత్తున అప్రెంటీస్ నియామకం చేపట్టేందుకు యజమానులను ప్రోత్సహించే ఉద్దేశంతో నేషనల్ అప్రెంటీస్(ఎన్ఎపిఎస్) ప్రమోషన్ స్కీం- అప్రెంటిస్‌ల ప్రోత్సాహక జాతీయ పథకం ద్వారా యజమానులకు పెద్ద ఎత్తున సహాయం అందించ పూను కుంది. యువతకు నైపుణ్యం కల్పించి, వారికి ఉద్యోగాలు కల్పించేపేరిట ఈ పథకాలను ప్రోత్సహించటం జరుగుతోంది. అయితే వాస్తవానికి కార్మికులకు, యజ మానులు జీతాలు, ఇతర బెన్‌ఫిట్లరూపేణ చేసే వ్యయాన్ని తగ్గించుకునేందుకు, కార్మికులు సాధరణంగా నిర్వహించే ఉత్పత్తి కార్యకలాపాలనే వారికి కల్పించవలసిన సామాజిక భద్రత, హక్కులు హరించివేసి, అతితక్కువ వేతనాలతో చేయించుకోవటానికి ఉద్దేసించినవే. కేంద్రంలో అధికారం చేపట్టిన ప్రభుత్వాలన్నీ కోట్లాది మంది అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా పారాటీచర్స్, చైల్డ్ లేబర్, స్కూల్‌టీచర్స్, సర్వశిక్షఅభియాన్ పథకం క్రింద పనిచేసే ఉపాధ్యాయులు వంటి వివిధ ప్రభుత్వాల పథకాల ద్వారా ఏవిధమైన చట్టబద్దత, ఉద్యోగభద్రత, సామాజిక భద్రతనీ అనీయుత రంగంలో నియామకాలు చేయడాన్ని ప్రోత్సహించాయి. స్వచ్చంద సేవకుల పారితోషికం పేరిట వీరితో పూర్తికాలం పనిచేయిస్తూ గౌరవభృతి పారితోషికం పేరిట అతి తక్కువ మొత్తాలు చెల్లించడం జరుగుతోంది.

(మిగతా నివేదిక వచ్చే సంచికలో)

కేరళలో సర్వాధికారాలతో గ్రామ స్వపరిపాలన

గ్రామస్వరాజ్యం, స్థానిక స్వపరిపాలన గురించి మన నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప.. పంచాయతీలను పరిపుష్టం చేయరు. స్థానిక సంస్థలకు పూర్తిస్థాయిలో నిధులు, విధులు బదలాయించరు. ఇక్కడంతా ఎమ్మెల్యేలదే పెత్తనం. పింఛన్లు, రోడ్లు.. అన్నీ వారి కనుసన్నల్లో జరగాల్సిందే. అర్హత ఉన్నా వారికిష్టం లేకపోతే పింఛను రాదు. అవసరం ఉన్నా రోడ్డు పడదు. నిధుల కోసం ప్రభుత్వం ముందు మోకరిల్లాల్సిందే. దాంతో పంచాయతీలు అవసరాలు తీర్చుకోవడం దాదాపు అసాధ్యంగా మారుతోంది.

కానీ కేరళలో అలా కాదు. అక్కడ పంచాయతీలే సుప్రీం. నిధులు, విధులు వారి చేతుల్లోనే ఉంటాయి. లబ్ధిదారుల ఎంపిక, అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, అమలు.. పూర్తిగా పంచాయతీలదే. ఆ రాష్ట్రం నిజమైన గ్రామస్వరాజ్యానికి నిలువెత్తు నిదర్శనం. సర్పంచికి తెలియకుండా ఒక్క నిర్ణయమూ జరగదు. పంచాయతీలు తమ బడ్జెట్‌ని తామే తయారు చేసుకుంటాయి. రాష్ట్ర బడ్జెట్‌లో 35-40% నిధులు నేరుగా పంచాయతీలకు వస్తాయి. వీటికితోడు ఆర్థికసంఘం నుంచి వచ్చే నిధులతో పాటు, సొంత ఆదాయ వనరులూ ఎక్కువే. ఒక్కో పంచాయతీ వార్షిక బడ్జెట్ రూ.4 కోట్ల వరకూ ఉంటుంది.


ప్రతి పంచాయతీకి సొంత వాహనాలున్నాయి. గ్రామ, బ్లాక్, జిల్లా పంచాయతీల రూపంలో కేరళలో పటిష్ఠమైన మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ ఉంది. ఆ రాష్ట్రంలో ప్రస్తుతం 941 గ్రామ పంచాయతీలు, 152 బ్లాక్ పంచాయతీలు, 14 జిల్లా పంచాయతీలు ఉన్నాయి. వీటి అధ్యక్షుల్ని ప్రత్యక్ష ఓటింగ్ విధానంలో ఎన్నుకుంటారు. జిల్లా ప్రణాళికా కమిటీలకూ రాష్ట్ర ఎన్నికల సంఘమే ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎన్నికైన అధ్యక్షుల్ని 'ఎగ్జిక్యూటివ్ అథారిటీ'గా ప్రకటిస్తారు.

పంచాయతీలకే సర్వాధికారాలు

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీలకు ఇవ్వాల్సిన 29 అధికారాలను కేరళ ప్రభుత్వం బదలాయించింది.

వాటిలో కొన్ని.. వైద్య కళాశాలలు, ప్రాంతీయ ప్రత్యేక ఆస్పత్రులు మినహా వైద్యసంస్థలన్నీ స్థానిక సంస్థల అధీనంలోనే ఉంటాయి.

ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్ని జిల్లా పంచాయతీలకు, ప్రాథమిక పాఠశాలలను పంచాయతీలకు బదలాయించారు.



పేదరిక నిర్మూలన పథకాలన్నీ పంచాయతీల ద్వారానే అమలవుతాయి. సాంఘిక సంక్షేమ బాధ్యతలన్నీ స్థానిక ప్రభుత్వాలవే. రైతులకు సహకారం, వాటర్‌షెడ్‌లు, చిన్నతరహా నీటిపారుదల, పాడిపరిశ్రమ అభివృద్ధి, ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ వంటి బాధ్యతలన్నీ పంచాయతీలవే. హైవేలు, జిల్లా ప్రధాన రహదారులు మినహా మిగతా రోడ్ల బాధ్యత వాటిదే. పారిశుద్ధ్యం, గ్రామీణ నీటి సరఫరా, లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడం వంటివన్నీ పంచాయతీలే చేస్తాయి.

అన్ని విభాగాలూ పంచాయతీ పర్యవేక్షణలోనే.. పంచాయతీరాజ్ సిబ్బందే కాకుండా, గ్రామ పరిధిలో పనిచేసే విద్య, వైద్యం, పశువైద్యం, వ్యవసాయం, ఇంజినీరింగ్, సంక్షేమ విభాగాలపై పర్యవేక్షణ కూడా పంచాయతీలదే. సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు స్థానిక సంస్థలకు అధికారం ఉంటుంది. పంచాయతీ స్థాయిని బట్టి 15-22 మంది శాశ్వత సిబ్బంది ఉంటారు. వీరు కాకుండా.. ఇతర విభాగాలకు చెందిన మరో 116 మంది పంచాయతీ పర్యవేక్షణలో ఉంటారు. సిబ్బంది స్వేచ్ఛకు భంగం కలగకుండా, వారు ఎవరికీ తలొగ్గాల్సిన అవసరం లేకుండా చూసేందుకు అవసరమైన రక్షణ వ్యవస్థ ఉంది.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్ని నిర్దిష్ట కాలావధిలోగా పంచాయతీల ద్వారా ఇచ్చేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐటీ కియోస్క్‌లు ఏర్పాటుచేశారు.

జనాభా ఎక్కువ.. బడ్జెట్టూ ఎక్కువే

మన రాష్ట్రంలోలా కేరళలో పంచాయతీలు వేలల్లో ఉండవు. వాటి వైశాల్యం, జనాభా ఎక్కువ. ఒక్కో పంచాయతీలో సగటు జనాభా 20 వేలు. కోజికోడ్ జిల్లా కరాస్సెరీ పంచాయతీలో 2001 జనాభా లెక్కల ప్రకారమే 23,659 మంది ఉన్నారు. ప్రతి పంచాయతీకీ వెబ్‌సైట్ ఉంటుంది. బడ్జెట్, ఆడిట్ నివేదికలు, పథకాల లబ్ధిదారుల వివరాల్ని ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. కరాస్సెరీ పంచాయతీ వార్షికాదాయం రూ.6 కోట్లపైనే.

గ్రామసభే సుప్రీం

కేరళ పంచాయతీల్లో గ్రామసభకు విశేషాధికారాలుంటాయి. లబ్ధిదారుల ఎంపిక, ప్రాధాన్యక్రమంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల్ని గుర్తించడం, సోషల్ ఆడిట్ వంటివి గ్రామసభల్లో నిర్వహిస్తారు.

ప్రతి పంచాయతీలో మూడు స్థాయీ సంఘాలుంటాయి. వాటిపై పర్యవేక్షణకు పంచాయతీ అధ్యక్షుడి సారథ్యంలో స్టీరింగ్ కమిటీ ఉంటుంది. వివిధ రంగాల నిపుణులతో అంశాలవారీగా ఫంక్షనల్ కమిటీలూ ఉంటాయి.

నిధులతో పరిపుష్టం

నిధుల బదలాయింపునకు నిర్దిష్ట వ్యవస్థ ఉంది. ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్‌తో పాటు, పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ విభాగాల నిర్వహణకు అవసరయ్యే నిధులూ ఆయా శాఖల బడ్జెట్‌ల నుంచి వస్తాయి.

వృత్తి పన్ను, ఆదాయ పన్ను, భవనాలకు అనుమతుల ఫీజు, వినోదపన్ను, సేవాపన్ను, వినియోగ రుసుములతో పంచాయతీలకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోంది.

నిధులు సమకూర్చుకునేందుకు స్థానిక సంస్థలు వినూత్న ఆలోచనలు చేస్తున్నాయి. పాలక్కాడ్ జిల్లా పంచాయతీకి మినీ జలవిద్యుత్ కేంద్రమే ఉంది.

ప్రతి పంచాయతీ ఒక సచివాలయమే

కేరళలో గ్రామ పంచాయతీ కార్యాలయమంటే పూర్తిస్థాయి సచివాలయమే. అన్ని పంచాయతీలకూ సొంత భవనాలున్నాయి. ప్రతి భవనంలో సమావేశ మందిరం, వేర్వేరు విభాగాలకు, సర్పంచి, కార్యదర్శులకు వేర్వేరుగా వసతులుంటాయి. ప్రతి పంచాయతీ కార్యాలయంలో సహాయతా కేంద్రం, ఫ్రంట్ ఆఫీసు ఉంటాయి.

గ్రామాల్లో హైస్పీడ్ రూరల్ బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం కల్పించారు. ఈ ప్రాజెక్టును మొదటగా 2015లో ఇడుక్కి జిల్లాలో ప్రారంభించారు.

ప్రభుత్వ పాత్ర పరిమితం

గ్రామ పంచాయతీల రోజువారీ వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పాత్రా ఉండదు. పంచాయతీ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలన్నా అంబుడ్స్‌మన్, అప్పిలేట్ ట్రైబ్యునళ్లతో సంప్రదించాల్సిందే. బడ్జెట్‌ను ఆమోదించనప్పుడు, మెజార్టీ వార్డు సభ్యులు రాజీనామా చేసినప్పుడే పంచాయతీల పాలకమండళ్లను రద్దుచేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. మిగతా సందర్భాల్లో అంబుడ్స్‌మన్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి.

స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు ఈ-సర్వీసు అందించేందుకు ఇన్ఫర్మేషన్ కేరళ మిషన్ (ఐకేఎం) పలు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు ప్రారంభించింది.

ప్రజా ప్రతినిధులకు శిక్షణ

ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులకు కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా) ద్వారా శిక్షణ ఇస్తారు. ఎన్నికలు పూర్తయిన నెలలోగా ప్రాథమిక శిక్షణ ఇస్తారు. తర్వాత రిఫ్రెషర్ కోర్సులు ఉంటాయి.

“ఆత్మ నిర్భర్” అంటే దేశ ఆస్తులు తెగనమ్మడమేనా?


- ఎ. అజశర్మ

తమ ప్రభుత్వం వ్యాపారం చేయదని, అందుకే ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటినీ ప్రైవేటీకరిస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేసేశారు. దీనికనుగుణంగానే ఇటీవల ప్రైవేటీకరణ స్పీడును పెంచారు. అయితే ప్రభుత్వ నిర్ణయానికి అంతే ధీటుగా, ప్రజల నుండి వ్యతిరేకత కూడా వ్యక్తమవుతోంది. మార్చి నెలలో బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు రెండు రోజుల సమ్మె, ఇన్సూరెన్స్ సిబ్బంది ఒక రోజు సమ్మె చేయబోతున్నారు.

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే ప్లాంట్ లోని కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఫిబ్రవరి 5 వ తేదీన సుమారు ఐదు వేలమందితో మోటార్ సైకిల్ ర్యాలీ, సభ జరిగాయి. రాష్ట్రంలోని అన్ని తరగతుల ప్రజల నుండి కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ దీన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసింది. అన్ని జిల్లాల్లోనూ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోనే కాక తెలంగాణాలో కూడా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

“విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు” అనే నినాదంతో, ఐదు దశాబ్దాల క్రితం 32 మంది బలిదానంతో సాగిన మహోద్యమం ద్వారా సాధించుకున్న తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ మణిహారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించడానికి అనుమతించేది లేదని, మరో మహోద్యమానికైనా సిద్ధమని ప్రజలు, ప్లాంట్ కార్మికులు పట్టుదలతో ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం దీనిని ఎందుకు ప్రైవేటీకరించాలని నిర్ణయించిందో లోతుగా పరిశీలించకుండా, కొంతమంది ప్రముఖులు ‘నష్టాలొస్తున్నాయి కాబట్టే ప్రైవేటీకరిస్తోందని’ వారే ఊహించేసుకుని,



పరిష్కారాలు కూడా చూపించేస్తున్నారు. ముఖ్యమంత్రి గారు ఇటీవల విశాఖలో పోరాట కమిటీ నాయకులతో మాట్లాడుతూ ఏడువేల ఎకరాల స్టీల్ ప్లాంట్ మిగులు భూములను అమ్ముకుని అప్పులు తీర్చేయొచ్చని తెలిపారు. అంతేకాక షేర్ మార్కెట్‌లో స్టీల్ ప్లాంట్ వాటాలను లిస్టింగుకు కూడా పెట్టవచ్చని సూచన చేశారు. అయితే భూములమ్మడం ఎన్నడూ పరిష్కారం కాదు. ఎందుకంటే ఇప్పుడైతే భూములమ్ముతారు. మరలా నష్టాలొస్తే అప్పుడిక ఏమమ్ముతారు? అలాగే వాటాలమ్మడం అంటే అది ప్రైవేటీకరణకు ప్రారంభమే. ఇది చివరకు పూర్తి ప్రైవేటీకరణకే దారి తీస్తుందని విశాఖలో ఉన్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమే ప్రత్యక్ష ఉదాహరణ. పది శాతం వాటాల అమ్మకంతో ప్రారంభమైన జింక్ ప్రస్థానం వాజ్ పాయ్ ప్రధానిగా ఉన్న కాలంలో వేదాంత కార్పొరేట్ కంపెనీకి పూర్తిగా ప్రవేటీకరించబడి, తరువాత మూసివేయబడింది. నేడు ఆ భూములతో ఆ కార్పొరేట్ కంపెనీ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెగబడింది. అందువల్ల ఇటువంటి సూచనలు ప్లాంట్ ను పరిరక్షించలేవు సరికదా, చివరకు పూర్తి బలహీనతకే దారితీస్తాయి. ఇంకో ప్రధాన పార్టీ నాయకుడు, తాము ప్రైవేటీకరణ విధానానికి వ్యతిరేకం కాదని తెలుపుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ మాత్రం వ్యతిరేకిస్తామని తెలిపారు. ఇదెలా సాధ్యమో వారికే తెలియాలి. ఎందు వల్లనంటే, ఈ ప్రైవేటీకరణ నిర్ణయానికి నష్టాలు కారణమని ఏనాడూ కేంద్ర ప్రభుత్వం తెలపలేదు. సరికదా నేడు దేశంలో ఉన్న 339 ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో రెండు డజన్లు మినహా మిగిలిన అన్నింటినీ లాభనష్టాలతో సంబంధం లేకుండా ప్రైవేటీకరిస్తామని స్పష్టంగా ప్రకటించింది. మరో పెద్దాయన, రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ గారైతే

మరో అడుగు ముందుకేసి, ప్రైవేటీకరణ అయినా పరవాలేదు కాని, వచ్చే పెట్టిబడిదారుడు మంచి వాడు ప్లాంటును నడిపేవాడు అయి ఉంటే చాలని సెలవిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాన్ని గమనించకుండా ఏవో పైపై సూచనలు చేయడం ఉపయోగకరం కాకపోవడమే కాక హానికరం కూడా. దేశంలోని ప్రైవేట్‌తో సహా అన్ని స్టీల్ ప్లాంట్‌లకూ స్వంత గనులు కేటాయించిన ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రం కేటాయించకుండా వివక్ష చూపుతోంది. ఇదే మన స్టీల్ ప్లాంట్ కష్టాలకు అసలు కారణం. అందువల్ల గనుల కేటాయింపు మాత్రమే సమస్యకు పరిష్కారం తప్ప మరో పరిష్కారం చూపితే, అది బలహీనతకే దారితీస్తుంది. అందువల్ల స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలంటే ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు విడనాడడం తప్ప మరో మార్గంలేదు.

దురదృష్టవశాత్తు నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని ఘనకార్యంగా భావిస్తోంది. దీనికి తగ్గట్లుగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారు తాము సంస్కరణలను మరింత స్పీడుగా అమలుచేస్తామని, నాలుగు కీలక రంగాల్లో నామమాత్రపు భాగస్వామ్యం తప్ప మిగిలిన అన్ని చోట్ల నుండీ ప్రభుత్వం పూర్తిగా వైదొలగుతుందని స్పష్టం చేశారు. అణుశక్తి, అంతరిక్షం, విద్యుత్, పెట్రోలియం, ఖనిజాలు, రవాణా, టెలికమ్యూనికేషన్స్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ వంటి నాలుగు రంగాల్లో కూడా నామమాత్రంగానే ప్రభుత్వ పాత్ర ఉంటుందని ఆమె తెలిపినట్లుగానే, ఆమె ఇవే రంగాలకు చెందిన రెండు బ్యాంకులను, ఒక ఇన్సూరెన్స్ కంపెనీని, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీని అమ్మేస్తామని తెలిపారు. ఎల్ఐసీలో వాటాల అమ్మకం చేయబడతాయని, ఇన్సూరెన్సు రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వాటాను ప్రస్తుతమున్న 49 శాతం నుండి 74 శాతానికి పెంచుతామని ప్రకటించడమే కాక, వీటికవసరమైన చట్ట సవరణలను కూడా ఫైనాన్స్ బిల్లులోనే పొందుపరిచారు. పోర్టులను ప్రైవేటీకరించేలా మేజర్ పోర్ట్ ఆధార బిల్లును రూపొందించారు. ఎయిర్ ఇండియాను, ఎయిర్ పోర్టులను సైతం ప్రైవేటుపరం చేస్తున్నారు. రైల్వే సంగతి సరేసరి. ఆమె కీలక రంగాలని పేర్కొన్న వాటిలోనే ఇలా చకచకా ప్రైవేటీకరణ చేస్తుంటే, ఇక మిగిలిన రంగాల్లో ప్రభుత్వ స్పీడు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీనికి తోడు ప్రభుత్వ ఆస్తులను కూడా తెగనమ్ముతామని ఆమె ప్రకటించారు.

విచిత్రమేమిటంటే, ఈ అమ్మకాల ప్రక్రియకు వారు పెట్టిన పేరు 'ఆత్మ నిర్భర్ భారత్'. అంటే దేశ స్వావలంబన. ప్రభుత్వ రంగాన్ని, వాటి ఆస్తులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు ధారాదత్తం చేయడం ఏ రకమైన ఆత్మ నిర్భరో సామాన్యులకు అంతుచిక్కని రహస్యమే.

ఈ ప్రభుత్వ రంగ పరిశ్రమలేమైనా ప్రభుత్వాధినేతలు, కొంతమంది కుహనా మేథావులు చెబుతున్నట్లు నష్టాలతో నడుస్తూ, ప్రభుత్వానికేమైనా గుదిబండగా మారాయా అంటే, దానికి భిన్నంగా ప్రభుత్వ రంగ పరిశ్రమలు మొత్తంగా చూస్తే, లాభాల బాటలో పయనిస్తూ, ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు సమకూరుస్తున్నాయి. దేశంలో నేడు ఉత్పత్తిలో ఉన్న 247 పరిశ్రమల్లో లాభాలొచ్చే 178 ప్రభుత్వ రంగ పరిశ్రమల నికర లాభాలు గత ఆర్థిక సంవత్సరం 1,74,587 కోట్ల రూపాయలు. అది అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 11.96 శాతం అధికం. అదే సందర్భంలో ప్రభుత్వానికి పన్నులు, డివిడెండ్ల రూపంలో ముందు సంవత్సరం కంటే 4.67 శాతం అదనంగా 3,68,803 కోట్ల రూపాయలు చెల్లించాయి. ఇదే కాలంలో వీటి ఆదాయాలు 20.12 శాతం వృద్ధితో 24,40,748 కోట్ల రూపాయలకు పెరిగాయి. గత పది సంవత్సరాల వివరాలు పరిశీలిస్తే, 2009-10 ఆర్థిక సంవత్సరంలో వీటి లాభాలు 1,32,222 కోట్లు ఉంటే, అవి బీజేపీ అధికారంలోనికి వచ్చేనాటికి అంటే 2013-14 లో 1,83,223 కోట్ల రూపాయల నుండి 2018-19 కల్లా 2,13,207 కోట్ల రూపాయలకు పెరిగాయి. ఈ పది సంవత్సరాల కాలంలో లాభాలు 61 శాతం పెరిగాయన్నమాట.

ఇంత అభివృద్ధి సాధిస్తున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఒక పక్క అమ్మేస్తున్న ప్రభుత్వం, మరోపక్క కార్పొరేట్లకు మాత్రం గొప్ప సేవ చేస్తోంది. గత సంవత్సరం ఆరు లక్షల కోట్ల రూపాయలకు పైగా ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం సబ్సిడీల రూపంలో చెల్లించింది. ఆరు లక్షల 60 వేల కోట్ల రూపాయల వీటి బ్యాంకు రుణాలను మాఫీ చేసింది. మోడీ ప్రభుత్వ కాలంలో కార్పొరేట్ కంపెనీల పారు బకాయిలు రెండు లక్ష కోట్ల రూపాయల నుండి 11.73 లక్షల కోట్లకు అంటే ఐదేళ్లలో ఐదు రెట్లు పెరిగాయి. ఇదీ వీరి ఘనకార్యం. దీనికి వీరు పెట్టిన పేరు 'దేశభక్తి'. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సేవ చాలదన్నట్లు ఇటీవల జరిగిన "నీతి ఆయోగ్" సమావేశంలో ప్రధాన మంత్రి గారు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఉపదేశం ఇచ్చారు. ఇదీ వీరి ఆత్మ నిర్భర్. అధినేతలే దేశాన్ని తాకట్టు పెట్టేస్తున్నప్పుడు దేశానికి రక్షగా ఉండవలసింది అనివార్యంగ ప్రజలే.

'కన్వీనర్, ఉత్తరాంధ్రాభివృద్ధి వేదిక



అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్తామని మనం ప్రతిజ్ఞ చేద్దాం

- డా॥కె. హేమలత

1910లో కోపెన్‌హగ్‌లో సోషలిస్టు మహిళల రెండో అంతర్జాతీయ మహాసభలో మహిళల సమస్యలపై దృష్టి సారించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలని నిర్ణయించింది. 1911లో లక్షలాది మహిళలు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీధుల్లో ప్రదర్శనలు జరిపారు. ఆ తరువాత ప్రతి సంవత్సరం మార్చ్ 8 ని మహిళాదినోత్సవంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

మహిళాదినోత్సవం జరపడానికి అసలైన కారణం శ్రామిక మహిళలు దోపిడీ పని పరిస్థితులకు వ్యతిరేకంగా, వారి హక్కుల కోసం పోరాడడం, అవి ఈ నాటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

పోరాటాల ద్వారా మహిళలు కొన్ని హక్కులు సాధించుకున్నారు. వారి పని పరిస్థితులు కొంతవరకు మెరుగుపడ్డాయి. కానీ పితృస్వామ్య విలువలు మహిళల పనిని తక్కువచేసి చూస్తూనే ఉన్నాయి. అసమాన వేతనాలు, ఇతర వివక్షతలు ప్రపంచ వ్యాప్తంగా ఈ నాటికీ తమ ప్రభావం చూపుతూనే ఉన్నాయి. నయా ఉదారవాద విధానాలు అమలవుతున్న నేటి తరుణంలో, కార్మికులపై జరుగుతున్న దాడుల దుష్ఫలితాలు మహిళలే అను భవించ వలసి వస్తోంది.

బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మహిళల పరిస్థితి మరింత దిగజారింది. మహిళలు కేవలం వంటింటి కుందేళ్ళుగా ఉండా లని, పిల్లలను భర్తను, ఇతర కుటుంబ సభ్యులను సాకాలనే తిరోగమన, పితృస్వామ్య దృక్పథానికి ప్రాచుర్యం లభిస్తోంది. స్నేహితులను జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే హక్కు, తమకు నచ్చిన దుస్తులు ధరించే హక్కు, తమ జీవితాలను తమకు ఇష్టమైన రీతిలో గడిపే హక్కు - ఈ హక్కులన్నీ మితవాదశక్తుల దారుణ దాడులకు గురవుతున్నాయి. మహిళలపై హింసా సంఘటనలు నానాటికి పెరుగుతున్నాయి.

2019-20 ప్రపంచ లింగ అంతరాల సూచీలో భారతదేశ స్థానం మరో నాలుగు స్థానాలు దిగజారింది. 2018లో 153 దేశాలను పరిశీలించగా మన దేశానిది 112వ స్థానం. ప్రపంచ ఆర్థిక ఫోరమ్ ఆర్థిక లింగ వివక్షత గణాంకాల ప్రకారం మన దేశంలో గడచిన 14 సంవత్సరాల్లో 39 స్థానాలకు దిగజారింది. 2006లో 110వ స్థానంలో ఉండగా 2020కి 149వ స్థానానికి పతనమైంది. మహిళలకు ఉండే ఆర్థిక అవకాశాలు ఈ నాడు ప్రపంచంలో అత్యంత అథమ స్థాయిలో ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు వెలువరించిన గణాంకాల ప్రకారం 2020 జూన్ నాటికి భారతదేశంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం దక్షిణ ఆసియాలోనే అత్యంత నీచ స్థాయిలో ఉంది. 1990లో 30.3 శాతం నుండి 2020కి 20.3 శాతానికి దిగజారింది. పాకిస్థాన్(22.2 శాతం) కన్నా, ఆఖరికి ఆఫ్ఘనిస్థాన్ (21.8 శాతం) కన్నా కూడా తక్కువగా ఉంది.

దీని భావం భారతదేశంలో మహిళలు పనిచేయడం లేదని కాదు. దీనర్థం మహిళల పని విలువ తక్కువవుతున్నదని లేదా పరిహారం చెల్లించని పని చేస్తున్నారని. 'మహిళల ఉద్యోగిత తగ్గడం, చెల్లింపులు చేసే పనిని నుండి చెల్లింపులు చేయని పనులకు వారు మళ్లుతున్నారని ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త జయతీ ఘోష్ తెలియజేశారు. గృహాల్లో చేసే పనిని పని కింద లెక్కించడం లేదు. ఆహార సేకరణ , కట్టెలు తేవడం, పశువుల పోషణ, నీళ్లు మోయడం, కుట్లు అల్లికలు, నేత మొదలయినవన్నీ ఇంటి పనిగా పరిగణించి "పని"గా నమోదు కావడం లేదు. ఓ ఈసీడీ (ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ) నివేదిక ప్రకారం, భారత దేశంలో మహిళలు పరిహారం చెల్లించని పనిని రోజుకి 6 గంటలు చేస్తారు. కానీ పురుషులు రోజులో 52 నిముషాలు మాత్రమే పరిహారం చెల్లించని పనిని చేస్తారు. పరిశోధకుల అంచనాల ప్రకారం మహిళలు చేసే ఇంటి పనితో సహా ఇతర గుర్తింపు లేని పనులను లెక్కలోకి తీసుకుంటే దేశంలో మొత్తం పనిలో పురుషుల భాగస్వామ్యం 79.8 శాతం ఉండగా మహిళలది 86.2 శాతం ఉంటుంది.

అయితే మహిళలు చేసే ఇంటి పనికి గుర్తింపు లేకపోవడం అన్నది ఇంటికే పరిమితం కాదు. మహిళలు ఇళ్లలో చేసే పనికి విలువ లేకపోవడం వలన ఆ పనిని బయట సమాజం కోసం చేసినప్పుడు కూడా

పని విలువ తక్కువ చేయబడుతుంది. మహిళలు ఇంటి బయట చేసే ఇటువంటి పనుల విలువ అతి తక్కువగా ఉంటున్నది. 'మహిళా సాధికారత' గురించి గొప్పలు చెప్పుకునే ప్రభుత్వమే మహిళల పనికి తక్కువ విలువ చెల్లిస్తోంది. లక్షలాది మహిళలు స్కీమ్ వర్కర్స్‌గా, ఐసీడీఎస్, ఆశా, యూఎస్‌హెచ్‌ఎ, ఎన్‌హెచ్ఎం లేదా మధ్యాహ్నం భోజన కార్మికులుగా - నియమించబడుతున్నారు.

మహిళలు, చిన్న పిల్లలకు వీరు పోష కాహారాన్ని అందిస్తారు. వారి ఆరోగ్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఈ పనులు చేస్తున్న వారందరూ మహిళలే. కానీ వారికి చెల్లిస్తున్నది గౌరవ వేతనాలు, లేదా ప్రోత్సాహకాలు. వారు కనీసం కార్మికులుగా కూడా గుర్తింపు పొందడం లేదు. ఈ పనులు కేవలం వారు ఇళ్లలో చేసుకునే పనులకు పొడిగింపులుగా సమాజం గుర్తించడం వలనే ఇది 'సామాజిక పని' అవుతోంది.

పైగా ప్రపంచ దేశాల్లో భారత దేశం లోనే పురుషులకు స్త్రీలకూ మధ్య వేతనాల్లో వివక్షత చాలా అధికంగా ఉంది. సరాసరిగా చూసుకుంటే పురుషులకు చెల్లించే వేతనాల్లో మహిళలకు రెండొంతులే చెల్లిస్తున్నారు.

వ్యవసాయ రంగంలో కూడా ఇదే దృక్పథం కొనసాగుతోంది. మహిళలు మన వ్యవసాయానికి వెన్నెముక వంటి వారు. వ్యవసాయానికి సంబంధించిన అనేక పనులు వారు చేస్తారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, అటవీ ఉత్పత్తుల సేకరణ వగైరా. గ్రామీణ భారతదేశంలో 73 శాతం శ్రామిక మహిళలు వ్యవసాయక పనుల పైనే ఆధారపడుతుంటారు.

కానీ వ్యవసాయ రంగంలో వారి పనికి గుర్తింపు లేదు. వారిని రైతులుగా గుర్తించడం లేదు. ఈ పితృస్వామ్య భావనే, ఈ మధ్య ప్రధాన న్యాయాధిపతి 'మహిళలను, వృద్ధులను 'నిరసన ప్రదర్శనల వద్ద ఎందుకు అనుమతిస్తున్నార'నే ప్రశ్నలో కూడా ఉంది.

పరిహారం లేని పని మహిళకు కేటాయించడం భారతదేశంలోనే లేదు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఇంటి పనికి కేటాయించే సమయం మగవారి కన్నా ఎన్నో రెట్లు అధికం. లింగ బేధాలు తక్కువగా ఉన్న దేశంగా నార్వే పరిగణించబడుతోంది. 2020 ప్రపంచ సూచికలో లింగ వివక్షత కొలమానంలో రెండో స్థానాన్ని పొందింది. అక్కడ కూడా మహిళలు మగవారి కన్నా రెట్టింపు సమయం ఇంటి పని చేస్తారు. జపాన్‌లో ఇది 4 రెట్లు. సమాజ పరిణామ క్రమంలో వ్యక్తిగత ఆస్తి, అది తమ వారసులకు చెందాలన్న ధోరణి అభివృద్ధి చెందిన క్రమంలో, చారిత్రకంగా పని విభజన జరిగిన క్రమంలోనే మహిళల శ్రమకు మగవారి శ్రమకన్నా తక్కువ విలువ నివ్వడం గమనించొచ్చు.

ఈ రోజు మహిళలు తాము చేసే పనిని పనిగా గుర్తించాలని, తమ పని విలువను తగ్గించ కూడదని, తమకు సమాన అవకాశాలు, సమాన వేతనాలు, సమాన హక్కులు కల్పించబడాలని పోరాటాలను కొనసాగిస్తున్నారు.

మహిళలు ముఖ్యంగా వివిధ స్కీముల్లో పనిచేసే మహిళలు, తమను కార్మికులుగా, ఉద్యోగులుగా గుర్తించాలని, తమ పనికి గౌరవ వేతనం కాదు, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సమాన వేతనాల కోసం, గర్భిణీ స్త్రీల మాతృత్వ ప్రయోజనాల కోసం, పిల్లల క్రష్‌ల కోసం, లైంగిక వేధింపులేని గౌరవప్రదమైన పని ప్రదేశాల కోసం, సురక్షితమైన సమాజం కోసం పోరాడుతూనే ఉన్నారు. అదే సమయంలో ఎన్నో సంవత్సరాలు పోరాటాలు చేయగా సంపాదించిన కార్మిక హక్కులు, సంఘ నిర్మాణ హక్కు, సామూహిక బేరసారాల హక్కులతో సహా ఎన్నో హక్కులను హరిస్తూ 'లేబర్ కోడ్స్' తయారు చేసి, కార్మిక వర్గంపై పాలక వర్గాలు చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాల్లో కూడా భాగస్వాములవుతున్నారు. లక్షలాది మహిళా కార్మికులు, ఉద్యోగులు వివిధ రంగాల్లోని కార్మికోద్యమాలు పిలుపులిచ్చిన సమ్మెల్లో, ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు.

తమను రైతులుగా గుర్తించాలని, భూమిని తమ పేరున రిజిస్టర్ చేయాలని పురుషులతో పాటు తమకు కూడా రుణ సదుపాయాలు కల్పించాలని మహిళా రైతులు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో తమ ఉనికికే ముప్పు తెచ్చిపెట్టే బడా కార్పొరేట్ వ్యవసాయానికి వ్యవసాయాన్ని అప్ప చెప్పే మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో, నిరసన ప్రదర్శనల్లో భాగస్వాములయ్యారు.

తక్షణ డిమాండ్లను ముందుకు తెస్తున్నా, సంపదనంతా కొద్ది మంది చేతుల్లో పోగుపడే కార్పొరేట్ల లాభాలకు అండగా నిలిచే మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల్లో భాగమే ఇవి. ఈ పోరాటాల్లో పెద్ద సంఖ్యలో భాగస్వాములైన మహిళలు వర్గ ప్రయోజనాల కోసం మాత్రమే పోరాడడం లేదు. పితృస్వామ్య విలువలను ప్రోత్సహిస్తున్న ప్రస్తుత విధానానికి వ్యతిరేకంగా కూడా పోరాడుతున్నారు.

అత్యధిక సంఖ్యలో పురుషులు మహిళలు పాల్గొనే, విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఇటువంటి పోరాటాలను మరింత పెంచాలి. అందులో మరింత మంది శ్రామిక జనం, పురుషులు మహిళలు పాల్గొనాలి. పితృస్వామ్యాన్ని పెంచి పోషించే నయా ఉదారవాద విధానాలను ఓడించి తీరాలి. మహిళలు ముందుకు సాగి, తమను విముక్తులను చేసుకునేందుకు అదే దోహద పడుతుంది. వారికి సమాజంలో తమదైన స్థానాన్ని కల్పిస్తుంది.

అటువంటి పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్తామని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేద్దాం.

అధ్యక్షురాలు, సిఐటియు

శ్రామిక మహిళల హక్కుల దినం - అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- కె.ధనలక్ష్మి



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని శ్రామిక మహిళా లోకానికి, మొత్తం కార్మిక వర్గానికి ఏపీ శ్రామిక మహిళా రాష్ట్ర సమన్వయ కమిటీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నది. గత సంవత్సర కాలం నుండి కరోనా మహమ్మారితో ముందు పీఠిన నిలబడి యుద్ధం చేస్తున్న వైద్య సిబ్బందికి, ఆశా, అంగన్వాడి, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులకు అభినందనలు. నేడు దేశం యావత్తు ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. మనువాదుల పాలనలో సరళీకరణ విధానాల వేగం పుంజుకున్నది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ధరల పెరుగుదల, దళితులు, మహిళలు, మైనారిటీల పైన దాడులు పెరిగాయి. అన్యాయాన్ని ప్రశ్నించే గొంతుకలు నొక్కి దేశద్రోహం కేసులు మోపబడుతున్నాయి. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ముఖ్యంగా మన రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు మరోవైపు మరలా పెరుగుతున్న కరోనా కేసులు వీటిని అధిగమిస్తూ 111వ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మనం జరుపుకుంటున్నాం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ నేపథ్యం:

1857 మార్చి 8న న్యూయార్క్ నగరంలో జరిగిన నాటి ఘటన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి స్ఫూర్తినిచ్చింది. పని ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాల కోసం, వేతనాల పెంపు కోసం, పనిగంటల తగ్గింపు కోసం, అమానవీయమైన చర్యలకు వ్యతిరేకంగా, ఓటు హక్కు కోసం, నాడు వందలాది మంది బట్టల మిల్లుల్లోని మహిళా "కార్మికులు చేసిన సమ్మె ఆకలి కడుపులతో పని చేయడం కన్నా పోరాడుతూ చావడం మేలు" అన్న నినాదం ప్రపంచ మహిళా లోకాన్ని మేల్కొలిపింది.

కార్మిక వర్గం ముందున్న సవాళ్లు:

కరోనా విలయం ప్రజలను పట్టి పీడిస్తున్న తరుణాన్ని పెట్టుబడిదారీ వర్గం తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలచుకోవడంలో కృతకృత్యులవుతున్నారు. అందుకు పాలకవర్గాలు 'డూ డూ బసవన్న' లాగా తలలాడించడంతో ప్రపంచ వ్యాప్తంగానే సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలు చిద్రమవు తున్నాయి. కార్మికవర్గ హక్కులు కాలరాయ బడుతున్నాయి. నిరుద్యోగం, పేదరికం విజృంభిస్తున్నాయి. మరోవైపు పాలకవర్గాలు సంపన్నులకు ప్రజా సంపదను దోచి పెడుతూ ప్రజలపై పెను భారాలు మోపుతున్నాయి. వీటన్నింటితో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నది శ్రామిక మహిళా లోకం. పడిపోతున్న ఉపాధి అవకాశాలు, తగ్గిపోతున్న ఆదాయాలు, కుటుంబ జీవితావసరాలు తీరక నరకయాతనను శ్రామికమహిళలు అనుభవిస్తున్నారు. ఇందుకు మన దేశం, మనరాష్ట్రం ఏమాత్రం మినహాయింపు కాదు.

పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఎత్తివేసింది. ఒక వైపు ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గిపోతుంటే మన దేశంలో ఆయిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ పైన గత 15 రోజుల్లో 75/- పెంచింది. గత సంవత్సర కాలంగా గ్యాస్ సబ్సిడీ అందలేదు. పెట్రోల్, డీజిల్ పైన సర్‌చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపుతూ ప్రజల నడ్డి విరుస్తోంది. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం యూజర్ చార్జీల పేరుతో ప్రజల నెత్తిన ఎడా పెడా భారాలు మోపి ఖజానా నింపుకోవాలని చూస్తున్నది.

కరోనా మూలంగా మూతపడిన పరిశ్రమలు నేటికి పూర్తిగా పునఃప్రారంభం కాలేదు. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న షాపింగ్ మాల్స్, షాప్స్, హోటల్స్ నిర్మాణ రంగం వంటివి ఇంకా కోలుకోలేదు. ఫలితంగా మహిళలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన రంగంలో పనిచేస్తున్న 'వైట్ కాలర్స్" వేతనాల్లో పెద్దఎత్తున కోతలు విధించడం, ఇంటి నుండే పని చేయడం మూలంగా సౌకర్యాలు, అలవెన్సుల్లో కోతలు పెట్టడంతో ఆధునిక కార్మికవర్గం మానసిక క్షోభకు గురవుతుంది.

రాష్ట్రంలో శ్రామిక మహిళల స్థితి గతులు:

ప్రభుత్వ పథకాల్లో పనిచేసే వారి పరిస్థితి దయనీయంగా ఉన్నది. ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికి కార్మికులుగా గుర్తించటం లేదు. కనీస వేతనాల్లేవు, పని భద్రత లేదు, ఈఎస్ఐ లేదు, పీఎఫ్ లేదు, అనారోగ్యం పాలయితే వైద్య సౌకర్యం లేదు, ప్రమాదం జరిగితే బీమా సౌకర్యం లేదు. చట్టబద్ధమయిన సౌకర్యాలు అమలు జరగటం లేదు.

ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లిస్తున్న అంగన్‌వాడీ, ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసి సంక్షేమ పథకాలను దూరం చేస్తున్నది. అర్హులైన అంగన్‌వాడీలకు

ఇళ్ళు, ఇళ్ళస్థలాలి వ్వాలని 1997లోనే ప్రభుత్వం జీఓ ఇచ్చినా నేటికి అమలు జరగలేదు. కుటుంబాల్లో ఆటో కార్మికులు, టైలర్స్ ఉంటే ప్రభుత్వ ఆర్థిక సాయం అందటం లేదు. వైధవ్యం పొంది కుటుంబ భారం మోస్తున్న వారికి సహితం వైధవ్య పెన్షన్ ఎత్తివేశారు. కుటుంబంలో వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్ నిలిపివేశారు.

అంగన్‌వాడీ ,ఆశా వర్కర్స్ , మున్సిపల్ కార్మికులకు మాత్రం ఇతర ఆదాయాలు వచ్చే ఏ పని చేయకూడదని ప్రభుత్వం షరతులు విధించింది. అమ్మ పెట్టా పెట్టదు - అడుక్కుతినానివ్వదు అన్న చందంగా ప్రభుత్వం కనీసవేతనం ఇవ్వదు, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించదు. ప్రభుత్వ ఉద్యోగుల్లాగా 60 సంవత్సరాలు దాటాయని ఆశాలకు, మున్సిపల్ కార్మికులకు ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించకుండానే ఒట్టి చేతులతో ఇంటికి పంపిస్తున్నారు.

అసంఘటిత రంగంలో పని చేస్తున్న లక్షలాదిమంది మహిళా కార్మికులకు చేతి నిండా పని లేక అరకొర వేతనాలతో బ్రతుకు లీడుస్తున్నారు. భవన నిర్మాణ రంగం, ఇంటి పని, ఉపాధిహామీ పథకం కార్మికులు, చిన్న చిన్న పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, స్కూల్స్, కాలేజీలు, రైల్వేల్లో పనిచేసే పారిశుధ్య పనులకు, హోమ్ బేస్డ్ వర్క్స్ షాప్స్, హోటల్స్ లాంటి వాటిల్లో మహిళలకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ కనీస వేతనాలు ఇతర చట్టబద్ధ సౌకర్యాలు ఏవీ అమలు కావడం లేదు. అరకొరగా దొరుకుతున్న కొద్దిపాటి పనులు తద్వారా వస్తున్న ఆదాయం, పెరుగుతున్న ధరలతో కుటుంబ అవసరాలు తీరక సతమతమవుతున్నారు.

రాష్ట్ర ప్రభత్వం స్కీమ్‌వర్కర్స్, మున్సిల్ కార్మికులను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉద్యోగులుగా నమోదు చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల నుండి వీరిని గెంటి వేస్తున్నది. వివిధ ప్రభుత్వ పథకాల్లో పని చేసే మహిళా కార్మికులు పశు మిత్రలు, బీమా మిత్రలు, కల్యాణ మిత్రలు 10 వేల మందిని వై.యస్.ఆర్ సి.పి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే తొలగించింది.

కరోనా సమయంలో సేవల పేరుతో నియమించిన 22 వేల మంది కోవిడ్ వారియర్స్‌ను పనిచేసిన కాలానికి కూడా వేతనాలు చెల్లించకుండా 'అవసరం తీరాక కూరలో కరివేపాకును తీసేసినట్లు' నిర్ధాక్షిణ్యంగా విధుల నుండి తొలగించింది.

పాలకులు మారినా మహిళలపై దాడులు తగ్గటం లేదు:

రాష్ట్రంలో వై.యస్.ఆర్. సి.పి అధికారంలోకి వచ్చాక కూడా మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. నెల్లూరులో మహిళా వాలంటీర్‌ను అధికార పార్టీ నాయకుడు దాడి చేసి కొట్టడం సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసింది. విజయవాడ బి.సి సంక్షేమ హాస్టల్‌లో పై అధికారులు లైంగిక వేధింపులకు గురి చేసిన ఘటనలు సాక్ష్యాధారాలు వున్నా ప్రభుత్వం మసి బూసి మారేడు కాయ చేసిన విధానం శ్రామిక మహిళలను ఆందోళనకు గురిచేస్తున్నది. ఇటీవల గుంటూరు జిల్లా నరసరావుపేటలో తనను ప్రేమించలేదనే సాకుతో ఉన్మాది విద్యార్థినిని హతమార్చిన సంఘటన రాష్ట్ర మంతా చర్చనీయాంశంగా మారింది.

మహిళలపై దాడులను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన 'దిశ' చట్టం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను నివారించడంలో వైఫల్యం చెందుతోంది. రాష్ట్రంలో హోమ్ శాఖా మంత్రిగా మహిళ వున్నప్పటికీ మహిళలపైన దాడులు యధేచ్ఛగా కొనసాగుతూనే వున్నాయి. కాబట్టి మారాల్సింది పాలకులు కాదు. పాలన విధానంలో మార్పు రావాలి.

ఉద్యమాల వెల్లువ:

గుర్తింపు కోసం, సమాన హక్కులు కోసం, సమాన వేతనం కోసం, ఉపాధి కోసం, పనిగంటల కోసం, గౌరవ ప్రదమయిన పనికోసం, ప్రసూతి ప్రయోజనాల కోసం, క్రెచ్‌ల కోసం, విశ్రాంతి గదుల కోసం, లైంగిక వేధింపులు నిరోధించడం కోసం, భద్రత కోసం, హింస, దాడులను అరికట్టడం కోసం, సమాజంలో గౌరవం కోసం నాటి నుండి నేటి వరకు శ్రామిక మహిళలు పోరాడుతూనే వున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన వార్డు, గ్రామ సచివాలయాల వ్యవస్థలో పని చేస్తున్న వాలంటీర్స్ నియామకాలు జరిగి రెండేళ్లు కావస్తున్నా నేటికీ వేతనాలు పెంచకపోవటం పని భారం పెరగటంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చి పోరాటాలు చేస్తు న్నారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు, మేట్‌లకు దీర్ఘకాలంగా వేతన బకాయిలు, గ్రామ పంచాయతీ కార్మికులకు 3 నుండి 18 నెలల బకాయిలు, వెలుగు వి.ఓ.ఏలకు 5 నెలల బకాయిలు, మధ్యాహ్నభోజనం కార్మికుల బిల్లులు 6 నెలల బకాయిలతో కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఒప్పంద కార్మికుల కోసం ప్రవేశ పెట్టిన 'ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్‌సోర్సింగ్ సర్వీసెస్' కార్మికుల ఉపాధికి గ్యారంటీ కల్పించక పోగా కొత్త రకం సమస్యలను తెచ్చి పెడుతున్నది. ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు ప్రశ్నార్థకంగా మారుస్తున్నది.

ప్రస్తుతం 'ఇంటికే సరుకులు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకంపేద ప్రజలను అగచాట్లకు గురిచేస్తున్నది. గంటల తరబడి వీధుల్లో నిలబడటమే కాదు, అసలు రేషన్ అందుతుందో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇవన్నీ కుటుంబ బాధ్యతలు మోసే మహిళలకు మరిన్ని కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేసినప్పటికి అనేక సమస్యలు ప్రజల్ని వెంటాడుతున్నాయి. రోజు రోజుకు అసంతృప్తులు పెరిగి పోరాటాలకు దారులు వేస్తున్నాయి.

మహిళల హక్కుల కోసం, పౌర హక్కుల కోసం, మనువాద భావజాలానికి వ్యతిరేకంగా, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో శ్రామిక మహిళల భాగస్వామ్యం పెరగాలి. విశాఖ ఉక్కు పరిరక్షణోద్యమంలో పాల్గొనాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో శ్రామిక మహిళలు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి.

కన్వీనర్,

ఏపి.శ్రామికమహిళ రాష్ట్ర సమన్వయ కమిటీ

పోక్సో చట్టానికి తూట్లు పొడిచిన తీర్పు


- బృందా కరత్

లైంగిక నేరాలకు సంబంధించినంత వరకు... మన న్యాయశాస్త్ర చరిత్రలో... లైంగిక దాడి చేసిన మగవాడి దృష్టి నుంచే చూస్తున్నారు. అంతేగానీ, బాధితులైన ఆడవారి కోణం నుంచి, పిల్లల వైపు నుంచి చూసే సునిసితత్వం లేదు. బాధితుల మీద లైంగిక భావనతో చేసే చర్య ఎటువంటి ప్రభావం చూపిస్తుంది? మరీ ముఖ్యంగా పిల్లలపై దాని ప్రభావం ఏవిధంగా ఉంటుంది?

బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులపై ఇటీవల ముంబై హైకోర్టుకు చెందిన నాగపూర్ బెంచ్ ఒక దారుణ మైన, అసాధారణ తీర్పు ఇచ్చింది. చిన్న పిల్లలు అత్యాచారానికి గురైన సందర్భంలో వారి ఒంటి మీద బట్టలు వుండి, చర్మానికి చర్మం తగలనంత వరకు దానిని రేప్ చేసే ప్రయత్నంగా భావించలేమని... ఆవిధంగా పోక్సో చట్టంలోని 7వ సెక్షన్ వర్తించదనీ తీర్పు ప్రకటించింది.

పోక్సో చట్టంలోని 7వ సెక్షన్ ఈ విధంగా చెబుతోంది - సెక్స్ చేద్దామనే కోరికతో ఎవరైనా పిల్లల మర్మాంగాలను, ఎద భాగాన్ని తాకినా... లేక పిల్లల చేత ఆయా భాగాలను తాకించాలని చూసినా... లేక సెక్స్ చేయాలనే కోరికతో అంగ ప్రవేశం లేకుండా శారీరక సంబంధం ఉన్నా అది లైంగిక అత్యాచారం కిందకే వస్తుంది. నిందితుడి తప్పును నిర్ధారించిన అడిషనల్ సెషన్స్ కోర్ట్ తీర్పును నాగపూర్ హైకోర్టు బెంచ్ తోసిపుచ్చింది. కానీ, బయటకు చెబుతున్న కారణం... సెక్షన్ 7 కింద విధించే కనీసం 3 ఏళ్ల జైలు శిక్ష కఠినంగా ఉన్నదని జడ్జి భావించటమే. బహుశా 'దామాషా' సిద్ధాంతం దీనికి ఆధారమేమో. తీర్పులో చెప్పిన దాని ప్రకారం- 'నేర తీవ్రతను బట్టి నేరానికి అనుగుణమైన శిక్ష ఉండాలనేది ప్రాథమిక సూత్రం'.

తీర్పులో పేర్కొన్న సత్యాలను ముందుగా పరికిద్దాం. 2016 డిసెంబర్ 12వ తేదీన 12 సంవత్సరాల బాలిక తన నివాస ప్రాంతంలో ఉన్న దుకాణానికి పండ్లు కొనుక్కుందామని వెళ్ళింది. ఈ విషయం చెపుతూ జడ్జి 'ఆమెకు కావలసిన బుద్ధి జ్ఞానం లేకపోలేదు' అని తీర్పులో నిర్దయగా పేర్కొన్నారు. అప్పుడు అదే ప్రాంతంలో ఉండే 39 ఏళ్ల వ్యక్తి ఆమె చేయి పట్టుకుని, ఆ పండ్లు తాను ఇస్తానని చెప్పి తీసుకెళ్లాడు. ఆమె తల్లి ఈ పిల్ల కోసం వెతకటం చూసి, ఆ పాప నిందితుడితో కలసి వెళ్లిందని



పొరుగు వ్యక్తి చెప్పాడు. తల్లి నిందితుడి ఇంటికి వెళ్లి వాకబు చేయగా, ఆ పిల్ల అక్కడ లేదని చెప్పాడు. గొళ్ళెం పెట్టి ఉన్న తలుపును బలవంతంగా తెరిచి, లోపల వెతకగా అక్కడ పాప ఏడుస్తూ కనపడింది. ఆ మగ మనిషి తన ఎద భాగాన్ని నొక్కాడని, తన వంటి మీద ఉన్న సల్వార్‌ను తీసేందుకు ప్రయత్నించాడని తల్లికి ఆ పిల్ల చెప్పింది. వెంటనే ఆమె బిగ్గరగా కేకలు వేయగా, నిందితుడు బయటకువెళ్లి ఇంటికి తాళం పెట్టాడు. జడ్జి గారి భావన ప్రకారం, ఆ పిల్లేగనుక వికలాంగురాలు అయితే నేరం చాలా తీవ్రమైనదే.

మహారాష్ట్రలో 1972లో 14 ఏళ్ల ఆదివాసీ బాలికపై పోలీసుస్టేషన్‌లో సామూహిక అత్యాచారం జరిగింది. ఆ బాలిక నుంచి ప్రతిఘటనగానీ, శరీరంపై బయటికి కనపడే గుర్తులు గానీ లేనందువల్ల ఆ బాలిక సమ్మతితోనే జరిగిందని సుప్రీంకోర్టు చెప్పింది. 'సెక్స్ ఆమెకు అలవాటే కనుక, తనతో సంపర్కానికి పోలీసులను (వారు అప్పుడు డ్యూటీలో ఉన్నారు) రెచ్చగొట్టింది" అని తీర్పులో చెపుతూ నిందితులను నిర్దోషులుగా వదిలివేసింది.

దశాబ్దాలుగా 'ఈవ్ టీజింగ్' అనే పదాన్ని లైంగిక వేధింపులకు వాడుతున్నారు. నిషేధించబడిన పండును తినటానికి పురుషుడిని ప్రేరేపించిందన్నది బైబిల్ కథనం. ఆ విధంగా 'టీజ్' అనే మాట పుట్టింది. ఇప్పటికీ భారత శిక్షా స్మృతి లోని 354 సెక్షన్ లైంగిక వేధింపుల నేరం 'స్త్రీ మానభంగం' గానే వివరిస్తోంది.

ఇదేదో విక్టోరియా కాలం నాటి భాషకు సంబంధించిన సమస్య కాదు. స్త్రీ తన దుస్తులు, ప్రవర్తన ద్వారా తన 'మర్యాదను' కోరుకుంటుంది. లేకపోతే ఆమె 'దాన్ని కోరుకుంటున్నట్టు'గానే వివరిస్తుంది.

ఒక స్త్రీ శరీర సమగ్రత, దానిపై ఆమెకున్న అధికారం మన దేశంలో ఉన్న శాసనాలు చేయటానికి ఆధారం కాదు. పిల్లలకైతే వివిధ స్థాయిల్లో జరిగే లైంగిక దాడులకు ప్రత్యేక చట్టం లేదు. పిల్లల సున్నితత్వాన్ని దృష్టిలో పెట్టుకుని చేసిన న్యాయ ప్రక్రియా లేదు. బహిరంగ న్యాయ స్థానంలో పిల్లను/పిల్లవాడిని నిలబెడతారు. ఆమె భయపడుతున్నా, బాగా ఏడుస్తున్నా, తనకు జరిగిన భయానక ఘటనన్ని, వయోజనుడైన నిందితుడు చేసిన దాడి గురించి సవివరంగా చెప్పమని అడుగుతుంటారు. అత్యాచారం నుంచి బయట

పడిన వారు, మహిళా సంఘాల వారు, ఉద్యమకారులు, సామాజిక స్పృహ కలిగిన పౌరులు...లైంగిక నేరాల్లో నిందితుడిని కేంద్రంగా చేసుకుని న్యాయ ప్రక్రియలో మార్పులు తీసుకురావాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి అనేక ప్రయత్నాల మూలంగానే మహారాష్ట్ర కేసు తరువాత, మళ్ళీ నిర్భయ కేసు తర్వాత చట్టాల్లో మార్పులు తీసుకొచ్చిన ఫలితంగానే లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణకు ప్రత్యేక చట్టం వచ్చింది. అనేక దశాబ్దాలుగా పిల్లలకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి, ఇప్పుడు న్యాయచట్రంలోకి వచ్చేలా చేశారు. ఇప్పు దున్నది అత్యుత్తమ న్యాయ చట్రమేనా అంటే... బహుశా కాదేమో. విధిస్తున్న శిక్ష తగినదేనా? చేసిన నేరం కంటే పెద్ద మోతాదులో శిక్ష ఉన్నదనే దానిపై ఆధారపడి వాదించటం లేదు. మరణదండన మానభంగాలను ఆపలేకపోయిందని చెప్పటానికి గట్టి రుజువులు ఉన్నాయి. అంతేగాక, బాధితుల ప్రాణాలు తీసేంత హాని తలపెట్టడానికి కూడా అవకాశం ఉన్నది. ఆమె కనుక ప్రాణాలతో లేకపోతే తనపై జరిగిన నేరాన్ని చెప్పలేదు. ఆ విధంగా శిక్ష తక్కువలో పడొచ్చు. 'తక్కువ కఠినం'గా శిక్షలు ఉండే విధంగా చట్టాల్లో మార్పు రావాలనే న్యాయశాస్త్ర విమర్శకుల ఎదుట ఇప్పుడు నాగపూర్ తీర్పు ప్రశ్నార్థకంగా నిలబడింది.

ఐద్వా ఆలిండియా ప్యాట్రన్

✦ ✦ ✦



'టూల్‌కిట్ కుట్ర' కేసులో కార్యకర్త అరెస్టు విక్రుతం

దిశ రవికి బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ కోర్టు
దేశద్రోహం అభియోగం మోపడంపై మండిపాటు

భారతదేశంలోని పోలీసులు, ముఖ్యంగా ప్రస్తుత పాలకుల అధీనంలో ఉన్న దళాలు, అనవసరమైన అరెస్టులను చేయడం మరియు వేధింపుల సాధనంగా ప్రశ్నార్థకమైన కేసులను నమోదు చేయడం వంటి సందేహాస్పదమైన రికార్డును కలిగి ఉన్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసనల నిర్వాహకుల కోసం ఒక సోషల్ మీడియా టూల్‌కిట్‌ను ఉపయోగించటాన్ని దేశద్రోహం మరియు అల్లర్లకు ప్రేరేపించడం అనే నమ్మశక్యం కాని ఆరోపణలు చేసిన కేసులో 22 ఏళ్ల వాతావరణ కార్యకర్తను అరెస్టు చేయడం ద్వారా ఢిల్లీ పోలీసులు ఈ రికార్డును అధిగమించారు.

> **ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంపై పౌరులకు పరిశీలన సహజం**
>
> దిశ రవికి ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఢిల్లీ అదనపు సెషన్స్ జడ్జి ధర్మేంద్ర రాణా ఆమెకు బెయిల్ మంజూరు చేశారు.
>
> ఖలిస్థాన్ అనుకూల సంస్థ 'పొయెటిక్ జస్టిస్ ఫౌండేషన్' (పీజేఎఫ్)తో ఆమెకు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు నిరూపించే ఆధారాలను వేర్పాటువాద ఆలోచనలతో ఆమెకు సంబంధం ఉందని చెప్పడానికీ ఆధారాల్లేవని కోర్టు పేర్కొంది. గతంలో ఎటువంటి నేర చరిత్రలేని యువతికి అరకొర ఆధారాలను పరిగణనలో తీసుకుని బెయిల్ నిరాకరించడానికి ఎటువంటి ప్రాతిపదిక కనిపించడం లేదని న్యాయమూర్తి అన్నారు. సమాజంలో బలమైన మూలాలున్న ఆమెను నిర్బంధించి జైల్లో పెట్టడాన్ని కోర్టు తప్పుపట్టింది.

ఢిల్లీ పోలీసు బృందం బెంగళూరుకు వెళ్లి దిశా రవిని అదుపులోకి తీసుకున్న విధానం, అంతర్రాష్ట్ర అరెస్టులపై ఢిల్లీ హైకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించకుండా, వక్రబుద్ధిని ప్రదర్శించడంలో మరియు అధికంగా వ్యవహరించడంలో, చట్టం అమల్లో కొత్త అర్థాన్ని సూచిస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో 24 గంటల వ్యవధిలో మిస్ రవిని ఢిల్లీ డ్యూటీ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినప్పటికీ, ఢిల్లీ పోలీసులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారా లేదా ఆమెకు న్యాయవాది ద్వారా సరిగా ప్రాతినిధ్యం వహించే అవకాశం ఇచ్చారా అనే దానిపై దాఖలాలు లేవు. గ్లోబల్ క్లైమేట్ చేంజ్ ఐకాన్ గ్రెటా థన్‌బెర్గ్‌తో సహా కార్యకర్తల మధ్య పంచుకున్న గూగుల్ పత్రాన్ని ఆమె సవరించినట్లు ఆమెపై ప్రధాన అభియోగం. టూల్‌కిట్‌ను ఖలీస్తానీ అనుకూల సంస్థ తయారు చేసిందని, దీని ఆధారంగా దిశా రవి భారతదేశానికి వ్యతిరేకంగా అసంతృప్తిని సృష్టించడానికి వేర్పాటువాదులతో కలిసి పనిచేస్తున్నారని ప్రాసిక్యూషన్ తేల్చింది. ఢిల్లీ పోలీసుల్లో ఎవరూ దీని పర్యవసానాలను పరిగణలోకి తీసుకోకపోవటం చాలా వింతగా వుంది. ఆన్‌లైన్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించేవారికి ఇటువంటి టూల్‌కిట్లు ఉండటం సర్వసాధారణం. వాటిలో నిరసనలకు పిలుపులు, ట్వీట్ చేయాల్సిన అంశాలు, ఉపయోగించాల్సిన హ్యాష్‌ట్యాగ్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధుల అడ్రసుల కంటే ఎక్కువ ఏమీ ఉండవు. ప్రత్యక్ష నిరసనల పై చర్చించటం, ప్లాన్ చేయటం హింసకు ప్రేరేపించటం కిందికి రాదు. దిశా రవి విషయంలో దేశద్రోహం ఆరోపణ చేసిన విధంగా ఎవరిపైనయినా ఇటువంటి ఆరోపణలు చేయాలంటే కనీసంగా హింసను ప్రేరేపించి ఉండటం తప్పనిసరి.

కోవ్యాక్సిన్ వేసుకుని చనిపోయిన అంగన్‌వాడీలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి

కడప జిల్లా పులివెందుల ప్రాజెక్టులో 2021, 19 ఫిబ్రవరిలో చనిపోయిన అంగన్‌వాడీ టీచర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కడప రిమ్స్ హాస్పటల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్, యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి పాల్గొని మాట్లాడారు. పులివెందుల పట్టణం అహోబిలపురంకి చెందిన టి.నారాయణమ్మ అనే అంగన్‌వాడీ టీచర్‌కు ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు వారాల క్రితం కరోనా వ్యాక్సిన్ ఇవ్వడం జరిగింది. వ్యాక్సిన్ ఇచ్చిన రెండో రోజు జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేర్చగా అక్కడి నుండి కడప రిమ్స్ హాస్పిటల్‌కి తరలించారు. అయినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఆసుపత్రి వారు డిశ్చార్జి చేశారు. ఇంటికి తీసుకొచ్చిన అంగన్‌వాడీ టీచర్ నారాయణమ్మ గంటలోపే చనిపోవడం జరిగింది. చనిపోయిన నారాయణమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఆ కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థిక సహాయం చేసి, ఆ కుటుంబంలో ఉన్న వారికి ఒక ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్ గారికి వినతిపత్రం ఇచ్చారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని, పోస్ట్‌మార్టం రిపోర్టు అనంతరం ఆర్థిక సహాయం అందించే విషయం ప్రభుత్వానికి నివేదిస్తామని తెలియజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) కసింకోట ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది.




ఫిబ్రవరి 23న కర్నూలు జిల్లా నందికొట్కూరు ప్రాజెక్టులోని కోవ్యాక్సిన్ వేయించుకుని చనిపోయిన అంగన్‌వాడీ హెల్పర్ షేక్ నూర్‌జహాన్ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కర్నూలు ఆసుపత్రి వద్ద రాత్రి 9.00 గంటల వరకు ఆందోళన జరిగింది. అధికారుల హామీతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో గౌస్‌దేశాయ్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కరోనా వ్యాక్సిన్ పై పూర్తి ప్రయోగాలు చేసిన తర్వాత మాత్రమే ప్రజలకు ఇవ్వాలని, ఇప్పటికే వ్యాక్సిన్ వికటించి చాలా మంది చనిపోవడం జరుగుతుందని దయచేసి వ్యాక్సిన్ ప్రయోగాలను సక్రమమైన రీతిలో చేయాలి తప్ప ఇలా ప్రజల ప్రాణాలు పోయే విధంగా ఇవ్వద్దని, కరోనాతో చనిపోయిన అంగన్‌వాడీ కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వారి కుటుంబానికి ఉద్యోగమిచ్చి కుటుంబానికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి, ఆరోగ్యశాఖా మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరక్టర్ గారికి వినతిపత్రాలు ఇచ్చారు.

అంగన్‌వాడీ వర్కర్స్ దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఫిబ్రవరి 25న పర్వాడ మండలం, ముత్యాలంపాలెంలో బిఎల్‌ఓ విధుల్లో ఉన్న అంగన్‌వాడీ వర్కర్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నాగశేషు మాట్లాడుతూ బీఎల్‌ఓ డ్యూటీలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లుకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో మినీ వర్కర్లను మెయిన్ వర్కర్‌తో సమానంగా వేతనాలు ఇవ్వాలి. సూపర్‌వైజర్ పోస్టులకు అవకాశం కల్పించాలని, 400 జనభా దాటిన మెయిన్ సెంటర్లుగా మార్చాలని,



కోరుతూ పార్వతీపురం ఐటిడిఏ కార్యాలయం వద్ద ఆందోళన జరిగిం.


ఆప్కాస్ వద్దు - పర్మినెంట్ కావాలి

మున్సిపల్ కార్మికుల సమ్మె విజయవంతం

మున్సిపల్ రంగంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ నుంచి మున్సిపల్ కార్మికులు మినహాయించాలని ఎన్.ఎం.ఆర్, పార్ట్ టైం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ వల్ల ఏడు నెలలుగా పీఎఫ్, ఈఎస్ఐ వాటా నిధులు ఖాతాల్లో జమకాకపోవడం, 60 ఏళ్లు నిండిన వారిని రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా నిర్దాక్షిణ్యంగా ఉద్యోగాల నుండి తొలగించడం, సంవత్సర కాలం బలవంతపు ఎగ్రిమెంట్ తదితర సమస్యలతో పాటు, ఇంజినీరింగ్ కార్మికులకు, స్కూల్ స్వీపర్స్‌కు జీతాలు పెంచాలని, సచివాలయాల శానిటరీ సెక్రటరీ నుండి వేధింపులు ఆపాలని, కరోనా కాలంలో నియమించిన కార్మికులు, మేస్త్రీలు, సూపర్వైజర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు సమ్మె జయప్రదంగా జరిగింది. రాష్ట్రంలోని 120 మున్సిపాలిటీల్లో వేలాది మంది మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె సందర్భంగా అన్ని కలెక్టరేట్లు, ఆర్డిఓ, మున్సిపల్ ఆఫీసు వద్ద నిరసన ధర్నాలు, ప్రదర్శనలు, వంటావార్పు కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఇతర సంఘాలను కలుపుకొని దీర్ఘకాలిక సమ్మెకు వెళతామని రాష్ట్ర నాయకత్వం హెచ్చరించింది.

గుంటూరు కలెక్టరేట్ వద్ద జరిగిన మున్సిపల్ కార్మికుల ధర్నానుద్దేశించి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల మెడకు ఉచ్చు బిగిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ నుండి మున్సిపల్ కార్మికులను మినహాయించి ఎన్.ఎం.ఆర్, పార్ట్‌టైం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెబ్‌సైట్ లలో ప్రభుత్వం ఉద్యోగులుగా నమోదు చేయడం వల్ల కార్మికులకు అమ్మఒడి పథకం అమలుకావడం లేదని ఆయన తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులు, స్కూల్ స్వీపర్స్‌కు నాలుగేళ్లుగా జీతాలు పెంచకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక సమస్యలతో ఛిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు పశ్చిమ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.విజయ కుమార్, తూర్పు గుంటూరు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామచంద్రరావు, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎం.శివలక్ష్మి, పి.యాకోబు, మల్లయ్య, చంద్రకళ, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

విజయవాడలో జరిగిన కార్యక్రమంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, పట్టణ పౌరసమాఖ్య రాష్ట్ర కన్వీనర్ సి.హెచ్.బాబూరావు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డేవిడ్, కోశాధికారి ఎస్.జ్యోతిబసు తదితరులు ప్రసంగించారు. కృష్ణాజిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేట, కొండపల్లిలో స్థానికంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ గాంధీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, టి.నూకరాజు కార్మికుల నుద్దేశించి ప్రసంగించారు. అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో హిందూపురం జిల్లా సి.ఐటి.యు కార్యదర్శి ఇ.ఎస్.వెంకటేష్, సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.నాగభూషణం, కడప కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా నుద్దేశించి సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.మనోహర్ తదితరులు ప్రసంగించారు. నెల్లూరులో మున్సిపల్ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు మాదల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు తదితరులు ప్రసంగించారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, కర్నూలు జిల్లాలో నంద్యాల, ఆళ్ళగడ్డ, ఎమ్మిగనూరు, ఆత్మకూరులో సమ్మె జయప్రదంగా జరిగింది. పార్వతీపురం సబ్ కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు, పి.శంకర్రావు, శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సంఘం నాయకులు ఎం.బలరామ్ ప్రసంగించారు. ప్రకాశం జిల్లా చీరాలలో ఏఐటియుసి అనుబంధ మున్సిపల్ కార్మికులు కూడా సమ్మెలో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగో లులో కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, టి.మహేష్, మార్కాపురం ఆర్డీఓ ఆఫీసు వద్ద జరిగిన ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.కె.ఎం.రఫీ, సుబ్బరాయుడు, ఖాదర్‌వలి తదితరులు ప్రసంగించారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ప్రదర్శన నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి సిఐటియు ప్రధాన కార్యదర్శి సీహెచ్. రాజ్‌కుమార్ ప్రసంగించారు. తూర్పు గోదావరి జిల్లా తుని, మండపేట, గొల్లప్రోలు, ముమ్మిడివరం, రామచంద్రాపురం, పెద్దాపురంలో స్థానికంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.



5వ డివిజన్ నందు మున్సిపల్ కార్మికురాలు ఉప్పు ఏలుగుండమ్మ మరణించింది. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని యూనియన్ తరఫున రూ. 28,200/- అందజేశారు.

సిఐటియు ఉద్యమ వార్తలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో హాజరైన మహిళలు



అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో పాల్గొన్న కె.ధనలక్ష్మి
అనకాపల్లి






పట్టణ ఆరోగ్య కేంద్రాల ఉద్యోగులను కొనసాగించాలని కోరుతూ
విజయనగరంలో డీఎం అండ్ హెచ్ఓ ఆఫీసు వద్ద ధర్నా
DM&HO ఆఫీసు వద్ద ధర్నా చేసి రిప్రజంటేషన్ ఇస్తున్న ఉద్యోగులు

పారిశుధ్య కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలి,
కార్మికుల సమస్యలను పరిష్కరించాలని





నంద్యాల్లో ఎం.పి, ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడి



ఒంగోలు కలెక్టరేట్ వద్ద డెయిరీ ఉద్యోగుల ధర్నా



సిఐటియు ఏపి నుండి కౌలు రైతులకు సంఘీభావ నిధి రూ. 50 వేలు. కౌలురైతుల ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య గారికి చెక్కు అందిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, పి.అజయ్‌కుమార్, కోశాధికారి ఏ.వి. నాగేశ్వరరావులు..



పార్వతీపురంలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐటిడిఏ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సిహెచ్‌డబ్ల్యు) ధర్నా చేశారు.

కోవిడ్ కాంట్రాక్ట్ ఉద్యోగులను కొనసాగించాలి



కరోనా రోగులకు వైద్య చికిత్స అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 22 వేల మందిని కాంట్రాక్ట్ పద్ధతిన నియమించింది. వీరందర్నీ అక్రమంగా తొలగించింది. ఈ ఉద్యోగులందర్నీ కొనసాగించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి నూర్ మహమ్మద్ ప్రసంగించారు. ఉద్యోగులందర్నీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, కృష్ణాజిల్లా అధ్యక్షులు ఏ.వెంకటేశ్వర రావు, 104 కాంట్రాక్టు ఉద్యోగుల నాయకులు రత్నరాజు తదితరులు కోవిడ్ ఉద్యోగుల ఆందోళనలకు మద్దతు తెలిపారు. వివిధ జిల్లాల నాయకులు సురేష్, గజేంద్ర, మహాలక్ష్మి, రవికుమార్, భరత్, అనంత్ తదితరులు ప్రసంగించారు.

1. ప్రజలందరికీ కరోనా వాక్సిన్ వేయాల్సిన నేపథ్యంలో, డాక్టర్లు, వైద్య, ఆరోగ్య పారామెడికల్ సిబ్బంది అవసరమవుతారు. వ్యాక్సినేషన్ సక్రమంగా ప్రజలందరికీ నిర్వహించడానికి ప్రస్తుతం పనిచేస్తున్న వేలాది మంది డెంటిస్టులు, ఆయూష్ తదితర డాక్టర్లు, అన్ని కేడర్ల పారామెడికల్ సిబ్బంది సేవలను కొనసాగించాలి.

2. అన్ని జిల్లాల్లో పనిచేసిన 6 నెలల కాలానికి మొత్తం వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి. పశ్చిమగోదావరి జిల్లాలో మొదటి బ్యాచ్‌లో నియమించబడిన 128 మందికి పనిచేసిన మొత్తం కాలం 8 నెలల 18 రోజులకు గానూ 6 నెలలే వేతనాలు చెల్లించారు. 2 నెలల 18 రోజులకు బకాయి వేతనాలు చెల్లించాలి.

3. తూర్పుగోదావరి తదితర జిల్లాల్లో వీరి వేతనాల నుండి కట్ చేసిన పీఎఫ్, ఈఎస్ఐల సొమ్మును యాజమాన్య వాటాతో సహా కలిపి వెంటనే వీరికి చెల్లించాలి.

4. వీరు చేసిన సర్వీసు కాలానికి సర్వీసు సర్టిఫికెట్ డీఎంహెచ్ ఓ ల ద్వారా వెంటనే జారీ చేయించాలి,

5. వైద్య, ఆరోగ్యశాఖలోని వివిధ విభాగాల్లో భవిష్యత్ నియామకాల్లో ఈ ఉద్యోగులకు ప్రాధాన్యతను ఇచ్చి నియమించాలి.

6. వైద్య, ఆరోగ్యశాఖలోని ఖాళీలలో కూడా వీరి సేవలను కొనసాగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి కొనసాగించాలి.

'కేంద్ర పోర్ట్ బిల్ -2020'ను రద్దు చేయాలని సిఐటియు ఆందోళన...

కాకినాడ: రాష్ట్రాల హక్కులను హరించడమే కాకుండా, లాభాల్లో ఉన్న పోర్టులను ఆదానీ వంటి కార్పొరేట్ లకు



అప్పగించడానికి సిద్ధం చేసిన 'కేంద్ర పోర్ట్ బిల్ -2020' ను రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ పోర్ట్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం వద్ద ఆందోళన జరిగింది.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ శతాబ్దాలుగా భారతదేశంలో నౌకా వాణిజ్యం జరుగుతోందన్నారు. 'భారత పోర్ట్స్ చట్టం - 1908' ఉంది. దేశంలో 660 చిన్న, మధ్యతరహా, భారీ పోర్ట్‌లు ఉన్నాయి. వీటిలో కొన్ని కేంద్ర పరిధిలో, కొన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్నాయి. దేశంలో ఏటా పోర్టుల ద్వారా సుమారు రూ.11 లక్షల కోట్లు ఆదాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూరుతోంది. ఈ సంపదను ఆదానీ వంటి కార్పొరేట్‌లకు అప్పగించడానికే తాజా బిల్లు సిద్ధం చేశారని విమర్శించారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో కూడా పోర్ట్ భూములు అమ్మాలని ప్రతిపాదించడం శోచనీయమన్నారు. మన రాష్ట్రంలో 14 పోర్టులు ఉన్నాయి. కేంద్ర బిల్లు చట్టమైతే చాలా నష్టపోతాం. దుగరాజపట్నం పోర్ట్ నిర్మాణం సహా విభజన హామీలు అన్నింటి అమల్లో కూడా మన రాష్ట్రానికి అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. మోడీ ప్రైవేటీకరణ విధానాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని, దీనికి వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన ప్రారంభించామన్నారు. ప్రజలంతా మన రాష్ట్ర హక్కుల రక్షణకు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు జరుగుతున్న ఉద్యమాలకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రమిచ్చారు.

మేకులు, కంచెలు, కందకాలు దాటుకుంటూ...

- వై.కేశవరావు

ఢిల్లీ పరిసరాల్లో రైతు దీక్షా శిబిరాలు ప్రారంభించి మూడు మాసాలు దాటుతోంది. ఎముకలు కొరికే చలిల్లోనూ, ఈదురుగాలులతో కురిసిన వర్షాలకు చెదరకుండా ఉద్యమం సాగుతోంది. ఈ కాలంలో 250 మంది వరకూ మరణించారు. తోటి రైతులు తమ కళ్ళముందే మరణిస్తున్నా చలించకుండా దీక్షా శిబిరాలు నడుస్తున్నాయి. అకుంఠిత దీక్షతో సాగిస్తున్న దీక్షా శిబిరాలను భగ్నం చేయటానికి బి.జె.పి ప్రభుత్వం సామ, దాన, భేద, దండోపాయాలన్నింటినీ తీవ్రంగా ప్రయోగించినా ఉద్యమం సాగుతూనే ఉంది. ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎన్ని నిర్బంధాలు పెట్టినా 500 పైగా రైతుసంఘాలు మొక్కవోని ధైర్యంతో ఐక్యంగా ఉద్యమాన్ని సాగిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం ఒకవైపు చర్చలు జరుపుతూనే మరో వైపు రైతు ఉద్యమం పంజాబుకే పరిమితమని, ఉద్యమకారులు ఖలిస్తాన్ వాదులని, ఉగ్రవాదులని, పాకిస్తాన్, చైనా ఏజెంట్లని, రాజకీయపార్టీలు రెచ్చగొట్టిన కిరాయిమూకలని, అత్యంత అసంబద్ధ నిందాప్రచారాలు సాగించింది. ఈ ప్రచారాలను ప్రపంచం నమ్మలేదు. లక్షలాది మంది రైతులు శాంతియుతంగా సాగుస్తున్న దీక్షలముందు ఈ వాదనలన్నీ తేలిపోయాయి. పది సంవత్సరాల పిల్లల నుండి తొంబై ఏళ్ళ వృద్ధుల వరకూ పురుషులతో సమానంగా మహిళలూ పాల్గొంటున్నారు.

పంజాబ్, హరియానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుండి ఢిల్లీకి రావాలని, మిగిలిన రాష్ట్రాలు ఎక్కడికక్కడ ఉద్యమాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్‌మోర్చా నిర్ణయించింది. ఆ పిలుపుపై లక్షలాదిమంది ఢిల్లీ పరిసరాలకు చేరారు. మిగిలిన 20 రాష్ట్రాల్లో 22 వేల కేంద్రాల్లో సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపులు అమలు జరుగుతున్నాయి. మహారాష్ట్ర నుండి నిర్వహించిన కిసాన్ మోర్చాతో పాటు, అన్ని రాష్ట్రాల నుండి నాయకత్వ బృందాలు, వాలంటీర్ల బృందాలు, దీక్షల్లో పాల్గొనే బృందాలు పాల్గొంటున్నాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల, సుప్రీంకోర్టు, ఐక్యరాజ్యసమితి మద్దతు లభించింది.

మూడు నల్ల చట్టాల వల్ల పంటలకు మద్దతు ధరల విధానం లేకుండా పోతుందని, మార్కెట్ వ్యవస్థ కనుమరుగవుతుందని 135 కోట్ల మంది ప్రజలకు ఆహారభద్రత లేకుండాపోతుందని, విద్యుత్ బిల్లు వల్ల వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్‌తో పాటు సామాన్యప్రజలకు సబ్సిడీలు రద్దవుతాయని క్రమంగా అందరూ అర్థం చేసుకుంటున్నారు. అందుకే ప్రభుత్వం చర్చల్లో మద్దతు ధరల విధానం ఉంటుందని హామీ ఇస్తామని మార్కెట్లను కొనసాగిస్తామని రాష్ట్రప్రభుత్వాలు నగదు బదిలీ పథకం అమలుపరుచుకోవచ్చని చెబుతోంది. మూడు చట్టాలు అమలయితే ప్రభుత్వ హామీలు గాలిలో కలిసిపోతాయని, హామీల వల్ల ప్రయోజనం లేదని, చట్టాలను వెనుకకు తీసుకోవాలని, స్వామినాథన్ కమీషన్ సూచన సి2+50 ఫార్ములా ప్రకారం మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని, సంయుక్త కిసాన్‌మోర్చా ఖండితంగా చెబుతోంది.

కేంద్రప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్ళమని సలహా ఇచ్చింది. సంయుక్త కిసాన్‌మోర్చా అందుకు నిరాకరించగా ప్రభుత్వమే కొన్ని సంఘాలను సృష్టించి కోర్టుకు పంపింది. సుప్రీంకోర్టు మూడు చట్టాలనూ కొంతకాలం పాటు సస్పెండ్ చేయడం, రైతులకు ఉద్యమం చేసే హక్కు ఉన్నదని సానుకూలంగా చెప్పినా రైతులతో చర్చించి పరిష్కారం కనుగొనేందుకు నలుగురితో కమిటీని నిర్ణయించింది. ఆ నలుగురూ అప్పటికే చట్టాలను సమర్థించేవారు కావడంతో సంయుక్త కిసాన్‌మోర్చా కమిటీతో చర్చించటానికి నిరాకరించింది. సంయుక్త కిసాన్‌మోర్చా పెట్టిన రిపబ్లిక్ పెరేడ్‌కు అనుమతి ఇవ్వాల్సి వచ్చింది.

జనవరి 26 రిపబ్లిక్‌డే రోజున లక్షలాది ట్రాక్టర్లు, రైతులు జాతీయ పతాకాలతో బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు పర్మిషన్ ఇచ్చిన ఢిల్లీ ఔటర్‌రింగ్ రోడ్డులో శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించారు. గంగవెర్రులెత్తిన ప్రభుత్వం రైతుల ప్రదర్శనను ప్రసారం చేయనీయకుండా ప్రసారసాధనాలన్నింటినీ రద్దు చేసింది. మరో వైపు తన అనుయాయులతో ఒక బృందాన్ని ఎర్రకోట వద్దకు పంపి, అక్కడ అల్లరి చేయించే చర్యకు పూనుకున్నది. ఈ బృందం నిర్వహించిన చర్చలకు బహుళప్రచారం ఇచ్చింది. అత్యంత జయప్రదంగా జరిగిన రైతు ప్రదర్శనను ప్రపంచానికి తెలియనీయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బృందం చర్యలను పెద్దది చేసి చూపించి రైతు ఉద్యమాన్ని దోషిగా నిలపాలని కుయుక్తులు పన్నింది. ఈ చర్య ఒక్కరోజులోనే బుడగలా పేలిపోయింది. ప్రభుత్వ కుతంత్రం దేశానికి, ప్రపంచానికి సాక్ష్యాలతో సహా వెల్లడయింది. ఎర్రకోట వద్ద జరిగిన దుశ్చర్యలకు నాయకత్వం వహించిన సిద్ధూ ప్రధానమంత్రితో కలిసి దిగిన ఫొటోతో సహా బయటకు వచ్చాయి. ప్రధాన ప్రచార సాధనాలన్నీ ప్రభుత్వ కనుసన్నల్లో ఉన్నా హిందూపత్రిక, న్యూస్‌క్లిక్, ది వైర్ వంటి ఆన్‌లైన్ సంస్థలు వాస్తవాలను మరుసటిరోజే ప్రపంచానికి సాక్ష్యాలతో సహా వెల్లడించాయి.

ఎర్రకోట దురంతం బయట పెట్టినందుకు ఆగ్రహించిన ప్రభుత్వం న్యూస్‌క్లిక్, ది వైర్ వంటి సంస్థలపై దాడులు

సాగించింది. ప్రముఖ విలేకరి రాజ్‌దీప్ సర్దేశాయ్ వంటి 9 మంది విలేకరులపై 'దేశద్రోహ' కేసులు పెట్టింది. అంతర్జాతీయ పర్యావరణ కార్యకర్త గ్రెటాదన్‌బర్గ్ పైన, ఆమె టూల్ క్విట్‌ను ట్వీట్ చేసిన పర్యావరణ కార్యకర్త దిశారవి పైన దేశద్రోహ చట్టం కింద కేసు పెట్టింది. ప్రపంచం మనలను గమనిస్తోందని, ఈ ఘోరస్థితిని అడ్డుకోవాలని, మూడు వ్యవసాయచట్టాలనూ రద్దు చేయాలని, దేశప్రతిష్ఠను కాపాడాలని కోరుతూ రాష్ట్రపతికి నావికాదళ మాజీ వైస్ అడ్మిరల్ రామ్‌దాసుగారు (87) రాసిన బహిరంగలేఖ ప్రజలను ఎంతో ప్రభావితం చేసింది.

జనవరి 26న ఎర్రకోట వద్ద జరిగిన ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఆ ఘటనను సంయుక్త కిసాన్‌మోర్చా నిశితంగా ఖండించింది. ఫిబ్రవరి 1న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఈ నేపథ్యంలో వాయిదావేసింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ప్రధాన రహదారుల్లో గోడలు నిర్మించింది. కందకాలు తవ్వించింది. ముళ్ళకంచెలు వేయించింది. రోడ్లపై ఇనపమేకులు నాటించింది. దీక్షా శిబిరాలకు మంచినీరు సరఫరా, విద్యుత్ సరఫరా నిలిపివేసింది. తాత్కాలికంగా నిర్మించుకున్న శానిటేషన్ సౌకర్యాలనూ తొలగించింది. టెలిఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్‌లు రద్దు చేసింది. శత్రు దేశాల సైన్యం దండెత్తి వస్తున్న రీతిలో కక్షపూరిత చర్యలు చేపట్టింది. శాంతియుతంగా దీక్షలు సాగుస్తున్న మన రైతాంగం పట్ల అనుసరించిన ఏహ్యకరమైన ఈ చర్యలను దేశప్రజానీకం, ప్రపంచం ముక్తకంఠంతో గర్హించాయి. టిక్రీ సరిహద్దులో ఉన్న శిబిరాలపైకి స్థానికుల పేరుతో ఆర్.ఎస్.ఎస్. గూండాలను, బి.జె.పి. గ్యాంగులను ఉసిగొల్పింది. తమ గ్రామాలకు అసౌకర్యంగా ఉందని శిబిరాలను తొలగించాలని ఎంతో ఒత్తిడి చేసింది. ఈ చర్యలకు ఆగ్రహించిన పరిసరాల గ్రామ ప్రజానీకం సమీకరణై ఆ గ్యాంగులతో తమకు సంబంధం లేదని, వారు తమ గ్రామాలవారు కానే కాదని తామంతా ఉద్యమంతోనే ఉన్నామని రైతాంగానికి బాసటగా నిలిచారు.

ప్రభుత్వ చర్యలన్నీ రైతాంగానికి ఆగ్రహం తెప్పించాయి. రెండురోజులు స్తబ్దతగా ఉన్న రైతాంగం ఒక్కసారిగా పెల్లుబికింది. క్యాంపులకు వేలాదిగా రావడం ప్రారంభించారు. కొత్త శిబిరాలు ఏర్పడ్డాయి. సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వాన్ని తీసుకెళ్ళి సభలు నిర్వహించడం ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్, హరియానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, రాష్ట్రాల్లో రైతాంగం వెల్లువలా కదులుతున్నారు. ఫిబ్రవరి 6, ఫిబ్రవరి 18న జరిగిన రాస్తారోకో, రైల్‌రోకోల్లో రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపులు స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని స్ఫురణకు తెస్తూ ఆయా చారిత్రక ఘట్టాలు జరిగిన తేదీల్లో ఇవ్వటం ఉత్తేజకరంగా ఉంది. మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వంటి స్వాతంత్ర్యోద్యమ నాయకులు రైతాంగ ఉద్యమనేతలను స్మరిస్తూ వారి జయంతి, వర్ధంతి సందర్భాల్లో పిలుపులు ఇవ్వటం ఉద్యమానికి ఉత్తేజం కలిగిస్తోంది.

ఈ ఉద్యమంలో ఒక ప్రధానమైన అంశం కార్మిక-కర్షక ఐక్యత బలపడడం. బి.జె.పి ప్రభుత్వం రెండు ప్రధాన ఉత్పత్తి రంగాలైన ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణకు పూనుకోవడం అందుకుగాను 100 సంవత్సరాల నుండి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కార్మిక కోడ్‌లు ప్రవేశపెట్టడం, రెండోది: మొత్తం వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడం కోసం కుయుక్తులు పన్నడం. స్వాతంత్ర్యానంతరం రైతాంగం పోరాడి సాధించుకున్న మద్దతుధరల చట్టం, మార్కెట్లు చట్టాలు, ప్రభుత్వ ఏజెన్సీలను నిర్వీర్యం చేసే చట్టాలు చేయడం ఏకకాలంలో తీసుకొచ్చిన ఈ చట్టాలు కార్మిక-కర్షక జనావళి ఏకం కావడానికి దారితీసింది. నవంబరు 26, 27 తేదీల్లో సంయుక్త కిసాన్‌మోర్చా గ్రామీణ హర్తాళ్ పిలుపు, ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ దేశవ్యాపిత సమ్మెకు పిలుపు ఇవ్వడంతో ప్రారంభం అయిన కార్మిక-కర్షక ఐక్యత భారత్‌బంద్, రిపబ్లిక్‌డే పెరేడ్‌ల సందర్భంగా మరింత బలపడింది. ఈ ఐక్యతను గ్రామస్థాయి వరకు పటిష్టపరుచుకోవాల్సుంది.

దేశవ్యాపితంగా పోల్చుకున్నప్పుడు మన రాష్ట్రంలో ఉద్యమం బలహీనంగా ఉంది. మన రాష్ట్రంలో అధికారపార్టీ, ప్రధానప్రతిపక్షం రెండూ బి.జె.పి. ప్రభుత్వానికి పోటీపడి మరీ మద్దతు ఇస్తున్నాయి. దేశంలోని 26 రాజకీయ పార్టీలు ఈ చట్టాలను వ్యతిరేకిస్తున్నప్పటికీ ఈ రెండు పార్టీలూ మద్దతివ్వడం అత్యంత శోచనీయం. ఈ స్థితిని అధిగమించడానికి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం గావించాల్సుంది. గ్రామ గ్రామానా కార్మిక-కర్షక ఐక్యత పెంపొందించడం తక్షణ అతి ముఖ్యమైన కర్తవ్యం.

అధ్యక్షుడు, ఏ.పి రైతుసంఘం



నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న శిబిరాలను సందర్శించి రైతులకు సంఘీభావం ప్రకటించిన సిఐటియు అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, ఆలిండియా ఆఫీసు బేరర్ జి.బేబిరాణి

ప్రభుత్వరంగ సంస్థల అమ్మకానికి మోడీ సర్కార్ కుట్రలు

- కె. ఉమామహేశ్వరరావు

"వ్యాపారం సర్కారు పని కాదు" "నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను వారసత్వం పేరుతో నడపడం దేశ ఆర్థిక వ్యవస్థకు భారం" ఈ మాటల ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం తెగబడుతోందని 'ఆత్మనిర్భర్ భారత్' గురించి గొప్పలు చెప్పుకున్న నరేంద్ర మోడీ గారు ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసే ఉద్దేశ్యాన్ని ఫిబ్రవరి 24న జరిగిన ఒక వెబినార్‌లో కుండ బద్దలు కొట్టినట్లు చెప్పడం దేశ ప్రజానీకాన్ని ఆశ్చర్యపరిచింది. ఈ ప్రకటన ద్వారా ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఫెసిలిటేటర్‌గా మారుతోందని దేశ ప్రధాన మంత్రి ప్రకటించడం సిగ్గుచేటు

ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసేందుకు బీజేపీ కుట్ర

కార్పొరేట్ సంస్థల కనుసన్నల్లో పనిచేస్తున్న బీజేపీ ప్రభుత్వం ప్రైవేటు రంగాన్ని ఆకాశానికి ఎత్తి ప్రభుత్వ రంగాన్ని అధఃపాతాళానికి తొక్కాలనుకుంటోంది. అందుకోసం సంస్కరణల వేగం పెంచి ప్రభుత్వ రంగ సంస్థలను బలిపీఠం ఎక్కిస్తున్నది. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కొనసాగించేందుకు ప్రజల సొమ్ము ఖర్చు పెట్టడం సరికాదంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సన్నాయినొక్కులు నొక్కుతూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. మంచి కుక్కను చంపాలంటే పిచ్చికుక్క అని ముద్ర వేయడం సరళీకరణ విధానాల లో భాగమే అన్నది జగమెరిగిన సత్యం.

ప్రభుత్వ రంగాన్ని అపహాస్యం పాలు చేస్తున్న బీజెపి ప్రభుత్వం

గత 73 ఏళ్ల స్వాతంత్ర భారతావనిలో ప్రజల కష్టార్జితంతో నిర్మించబడ్డ ప్రభుత్వ రంగ సంస్థలను ఆధునీకరించడం యాజమాన్య లోపాలను సరిదిద్ది సమర్థవంతంగా నడిచేటట్లు చర్యలు తీసుకోవడం, అవసరమైన మేరకు వనరులను సమకూర్చడం తదితర సమస్యలను పరిష్కరించడంలో ఇప్పటివరకు పరిపాలించిన ప్రభుత్వాలు ఆ దిశగా వ్యవహరించలేదు. కానీ ప్రభుత్వ రంగం దేశ ఆర్థికాభివృద్ధిలో ముఖ్యమైన పాత్రను పోషించింది. కోట్లాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించింది. సామాజికంగా అణగారిన వర్గాలు, వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతికి దోహదపడుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పకు వనరులు సమకూర్చుతోంది. ఇంతటి ప్రాధాన్యత గలిగిన ప్రభుత్వ రంగం పైనే మోడీ ప్రభుత్వం దుర్మార్గపు దాడికి పూనుకొంది. పాలకుల వైఫల్యాలను కప్పిపుచ్చి ప్రభుత్వరంగాన్ని దోషిగానిలబడడం బీజేపీ కుట్రలో భాగమే. తొలుత బ్యాంకులు, బీమారంగం, విద్యుత్ తదితర సంస్థలన్నీ ప్రైవేటు రంగంలో వుండేది. వాటన్నింటినీ జాతీయం చేసి ప్రజల సొత్తుగా మార్చారు. వాస్తవాలను మసిబూసి మారేడుకాయ చేయడం బీజెపికే చెల్లింది.

ఆరున్నరేళ్ల క్రితం 'మేక్ ఇన్ ఇండియా", మేడ్ ఇన్ ఇండియా", ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు", దేశాన్ని ఆర్థికంగా ఉరకలెత్తిస్తాం" అంటూ ఆకర్షణీయ నినాదాలతో ఊదరగొట్టిన బీజేపీ పాలకుల నిజ స్వరూపం తేటతెల్లం కావడం గమనార్హం.

ఏది వ్యాపారం? ఎవరికోసం?

నష్టాలొస్తున్నాయనే సాకుతో ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించాలని, ప్రైవేటు సంస్థలైతే ఆధునిక పద్ధతులు అవలంభించి అభివృద్ధి చేస్తాయని మోడి ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. దివాళా తీస్తున్న ప్రైవేటు రంగంను కాపాడుతున్నది ఎవరు? ప్రభుత్వ బ్యాంకుల వద్ద అప్పులు తీసుకుని లక్షల కోట్లు ఎగ్గొట్టింది ఎవరు? కార్పొరేట్ సంస్థలు కాదా? వాటి అప్పులను మాఫీ చేసి రక్షిస్తున్నది మోడీ ప్రభుత్వం కాదా?

విశాఖ ఉక్కు ప్రభుత్వ సహాయ నిరాకరణ ఎదుర్కొని ప్రపంచ ప్రశంసలు పొందుతున్నది వాస్తవం కాదా? రెండు లక్షల కోట్ల ఆస్తులు కల్గిన విశాఖ ఉక్కును ఆరువేల కోట్లకు తెగనమ్మడం ప్రజల ఆస్తులను కాపాడేందుకేనా? అసలు నష్టాలే లేని 31లక్షల కోట్ల విలువైన ఆస్తులు కల్గిన ఎల్.ఐ.సి.ని.10లక్షల కోట్లకు అమ్మేయాలనుకోవడం ప్రజల శ్రేయస్సు కోసమేనా? బంగారు బాతుగుడ్డు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మడం దేశ వినాశనానికే దారితీస్తుంది తప్ప దేశ ప్రయోజనాలను ఏవిధంగానూ కాపాడలేదు.

అదానీ, వేదాంత కంపెనీలకు ముడి ఇనుము గనులను కేటాయిస్తున్న మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కుకు ఎందుకు కేటాయించడంలేదు. సవతితల్లి ప్రేమ ఒలకబోస్తూ ప్రజల సొమ్ముకు తామే నిజమైన కాపాలాదారుగా బీజేపీ ప్రభుత్వం ఫోజు పెట్టడం ఎవరి గొంతులు కోయడానికి?

స్వదేశీ బండారం బట్టబయలు

స్వదేశీ నినాదం గురించి నిత్యం కొంగ జపం చేసే బీజేపీ, ఆర్.ఎస్.ఎస్.ల నిజ స్వరూపం ఒక్కొక్కటిగా బయట పడుతూనే వున్నాయి. విశాఖ ఉక్కును దక్షిణ కొరియా దేశానికి చెందిన ఫోస్కో కంపెనీ కి కట్టబెట్టేందుకు సిద్ధం అయ్యింది. ఎల్.ఐ.సి.లో 74 శాతం వాటాలను విదేశీ బీమా కంపెనీలకు అప్పగించబోతోంది. దేశ కీలక రంగమైన రక్షణ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ద్వారాలు బార్లా తెరుస్తోంది. భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఇస్రోను సహితం అమ్మడానికి పూనుకుంది. హైదరాబాద్ ఐ.డి.పి.ఎల్.కు చెందిన 1200 ఎకరాలను కారుచౌకగా అమ్మేయడానికి సన్నద్ధం అవుతోంది. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణల పేరుతో బహుళజాతి సంస్థలకు తాకట్టు పెడుతోంది. అంటే మోడీ ప్రభుత్వం సర్వం ప్రజల ఆస్తులను తెగనమ్మి ఖజానా నింపుకోవడంతో పాటు లక్షల కోట్ల విలువైన ప్రజాధనాన్ని విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే పరమావధిగా భావించి పనిచేస్తున్నది.

ప్రజలపైన మొసలికన్నీరు

ప్రజల ఆస్తులను కాపాడేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధి తో వున్నట్టు కపట ప్రేమ నటిస్తున్న మోడీ ప్రభుత్వం మరోవైపు ప్రజల నెత్తిన మోయలేని భారాలు మోపుతోంది. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలపైన సర్ ఛార్జీ

లను పెంచి కోట్లాది రూపాయలు ప్రజల పళ్లూడగొట్టి వసూలు చేస్తున్నది. మరోవైపు భారతదేశ ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడిచి జీఎస్టీ పన్నుల వాటాలో రాష్ట్రాలకు వాతలు పెడుతోంది. ఇంకోవైపు సంపన్నులకు వరాల మీద వరాల జల్లులు కురిపిస్తూ దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెంచుతోంది. ఫలితంగా గత 50 ఏళ్ల క్రితం నాటి స్థితికి నిరుద్యోగం చేరుకుంది. ఏడాది కాలంగా ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కరోనా మహమ్మారి ప్రమాదం ఇంకా సమసి పోలేదు.

దేశాన్ని అప్పుల సుడిగుండంలోకి నెట్టి మోడీ ప్రభుత్వం

2014లో మోడీ ప్రభుత్వం గద్దె నెక్కే నాటికి దేశం 52 వేల కోట్లఅప్పు అప్పుల్లో ఉంది. గత 6 దేశాల్లో మోడీ హయాంలో 50 వేల కోట్లు వెరసి లక్ష కోట్లకు అప్పు పెరిగింది. ప్రభుత్వరంగ సంస్థలు అప్పుల్లో వున్నాయిగనుక వాటిని అమ్మేస్తానంటున్నారు. మరి దేశాన్ని అప్పుల సుడిగుండంలోకి నెట్టిన మోడీగారు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణం గద్దె దిగి పోవాలి. అందుకు మోడీ సిద్ధమవ్వాలి.

ఈ నేపథ్యంలో దేశాన్ని రక్షించుకునేందుకు ప్రభుత్వ రంగాన్ని పటిష్టపర్చడం ఉపాధి హామీ పథకాన్ని మరింత ప్రోత్సహించడం, పట్టణాలకు విస్తరింప జేయడం మూతబడిన పరిశ్రమలకు అవసరమైన సహాయ సహకారాలను అందించి ఉపాధీ అవకాశాలు పెంచడం, ప్రజల కొనుగోలు శక్తి ని పెంచేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి, అది జరగాలంటే సంపన్నుల పైన అధిక పన్నులు వేయాలి, మొండి బకాయిలను వసూలు చేయాలి . ఈ పనులు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధం కాకపోగా ప్రజల నెత్తిన బండలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోంది. మోడీ ప్రభుత్వ బండారాన్ని ప్రజలముందు వుంచాలి 2021-222 కేంద్ర బడ్జెట్ లో మన రాష్ట్రానికి జరిగిన మోసాన్ని ప్రజలకు వివరించి ప్రజాపోరాటాలకు ఊపిరి పోయాల్సిన భాద్యత ప్రజాతంత్రవాదులు, అభ్యుదయవాదులందరిపైనా వుంది.

✦ ✦ ✦

ఎగవేతలన్నీ ప్రైవేటోళ్లవే
ఎస్.బి.ఐ చీఫ్ రజ్నీష్ కుమార్

'బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిలన్నీ ప్రైవేటోళ్లవే! ఒక్క ప్రభుత్వరంగ సంస్థ కూడా అప్పులు ఎగ్గొట్టిన దాఖలాల్లే' వని ఎస్.బి.ఐ చీఫ్ రజ్నీష్ కుమార్ అన్నారు. ఎకనామిక్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించా లంటూ వస్తున్న వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. 'అప్పులు ఎగ్గొట్టే వాళ్లే ముందు వరుసలో కూర్చొని నీతి సూత్రాలు వల్లిస్తున్నారు. దొంగలే దొంగా... దొంగా అని అరుస్తున్నారన్నట్లుగా వారి వ్యవహార ముంది. ప్రైవేటు రంగంలో పాలనా విధానాలు బాగుంటే అప్పులు ఎందుకు ఎగవేస్తున్నాయి? దివాళా ఎందుకు తీస్తున్నాయి? అని ప్రశ్నించారు. సమాజ శ్రేయస్సు కోసం సామాజిక స్పృహతో ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రమే పనిచేస్తాయని ఆయన చెప్పారు.

పెట్రోల్, డీజిల్ పెంపుదలకు వ్యతిరేకంగా భారత్ బంద్

పెరిగిన పెట్రోల్ ధరలకు వ్యతిరేకంగా, కొత్త ఈ-వేబిల్లు, జీఎస్టీ నిబంధలను వ్యతిరేకిస్తూ అఖిల భారత వ్యాపార సమాఖ్య (సీఏఐటీ) దేశవ్యాప్త బంద్‌కు పిలుపు ఇచ్చింది. దీనికి అఖిల భారత రవాణా సంక్షేమ సంఘం (ఏఐటీడబ్ల్యూఏ) కూడా మద్దతు తెలిపింది. సిఐటియు మద్దతు తెలిపింది. 40 వేల వ్యాపార సంస్థలకు చెందిన 8 కోట్లకుపైగా వ్యాపారులు బంద్‌లో పాల్గొన్నట్టు సీఏఐటీ తెలిపింది. అత్యవసర సర్వీసులకు మినహాయింపు ఇచ్చారు. ఢిల్లీలో వ్యాపార సంఘాల నిరసనలో ఆందోళన చేస్తున్న రైతులు కూడా పాలొన్నారు. ఈ కామర్స్ సంస్థలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బంద్‌కు అఖిల భారత వాహనదారుల సంక్షేమ సంఘం కూడా మద్దతు తెలిపింది. దీంతో లక్షలాది ట్రక్కులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.



పంజాబ్, హరియాణాలోని వ్యాపారులు బంద్‌కు మద్దతు తెలిపినా దుకాణాలను మాత్రం తెరిచే ఉంచారు. దుకాణాలు తెరవకుంటే ఇప్పటికే నష్టాల్లో ఉన్న తాము మరింత ఇబ్బందుల్లో కూరుకుపోతామని భావించే తాము షాపులను తెరిచినట్టు పలువురు వ్యాపారులు తెలిపారు. ఒడిశా అంతటా దుకాణాలు మూతపడ్డాయి. మహారాష్ట్ర, బీహార్, ఆంధ్రప్రదేశ్ లాంటిచోట బంద్ జరిగింది.

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం - రాజకీయ ప్రకంపనలు

"ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ 2021 జనవరి 27న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (విశాఖ స్టీల్ ప్లాంటు)లో నూటికి నూరుపాళ్లు ప్రభుత్వ వాటాలను యాజమాన్యంతో సహా ప్రైవేటీకరించటానికి సూత్రప్రాయ ఆమోదం తెలిపింది." - **పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల యాజమాన్య శాఖ కార్యదర్శి టి.కె.పాండే.**

జనవరి 28న తెల్లారే ఈ వార్త పొక్కగానే స్టీల్ ప్లాంటులోని కార్మికులంతా ఏకమై భగ్గుమన్నారు. రాష్ట్రమంతా అగ్గిమీద గుగ్గిలమయింది. అప్పటి నుండీ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఒకటిగా ఆందోళనలు, పోరాటాలు కొనసాగిస్తున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం కానీయం అంటూ రోడ్ల మీదకు వస్తున్నారు. దీంతో రాజకీయ పార్టీల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. ప్రైవేట్ అనుకూల రాజకీయ పార్టీలు కూడా వ్యతిరేకంగా మాట్లాడాల్సిన అనివార్య పరిస్థితి తలెత్తింది. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణపై వివిధ రాజకీయ పార్టీల స్పందన :

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి:

"స్టీల్ ప్లాంటుకు అప్పులు ఇచ్చిన బ్యాంకుల రుణాలకు బదులుగా బ్యాంకులకు స్టీల్ ప్లాంటులో వాటాలివ్వాలి. ఆ వాటాలను తిరిగి బ్యాంకులు పబ్లిక్‌కు అమ్ముకునే అవకాశం ఇవ్వాలి."

కామెంట్ : దీని అర్థం ప్రైవేటీకరణకు అంగీకారమనే కదా మహాశయా!

"స్టీల్ ప్లాంటు భూములు అమ్ముకుని ప్లాంటుకు ఆ డబ్బులను ఉపయోగించుకోవచ్చు."

కామెంట్: ఇది కూడా ప్రైవేటీకరణకు దారేకదా సారూ!

ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు:

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చంద్రబాబునాయుడు ఈ కింది విధంగా సలహా ఇచ్చారు.

"స్టీల్ ప్లాంటు అమ్మకాన్ని ఆపాలి లేదా రాజీనామా చేసి జైలుకు వెళ్లాలి లేదా తనకు ఇష్టమైన చోటికి వెళ్లాలి."

కామెంట్ : చంద్రబాబుగారూ! రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, మూసివేతలకు పాల్పడ్డ మీ విధానాలను ప్రజలు మర్చిపోలేదు. మీరు అధికారంలో ఉండగా 1999 లో బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించాలనుకున్నపుడు మీరు బలపర్చిన సంగతి



మర్చిపోలేం సారూ! ప్రభుత్వంలో ఉండగా ఒకమాట, ప్రతిపక్షంలో ఉండగా మరో మాట మీ అలవాటని ఎల్లరూ ఎరిగినదే!

సోము వీర్రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు:

"స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు సంబంధించి ఏ కేంద్రమంత్రీ ప్రకటన చేయలేదు, ఏ అధికారిక సమాచారమూ జారీ కాలేదు. టీడీపీ, వామపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని అనవసరంగా విమర్శిస్తున్నాయి."

"గుడుల మీద దాడి చేసే వారిని చట్టానికి పట్టించే బీజేపీ ప్రయత్నాల నుండి ప్రజల దృష్టిని మళ్లించటానికి వైసీపీ, టీడీపీలు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆయుధాన్ని వాడుతున్నాయి."

కామెంట్ : అయ్యా! వీర్రాజుగారూ! స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించటం లేదు అని ఆర్థిక వ్యవహారాల కమిటీలో ఉన్న కేంద్ర మంత్రుల చేత చెప్పించండి చూద్దాం! మధ్యలో మీ నాటకాలు ఎందుకు? గుడి చుట్టూ, మతం చుట్టూ రాజకీయాలను తిప్పటం మీకూ మీ పార్టీకీ అలవాటు. దానికి గండి పడిందనే కదా మీ బాధంతా! ఇక మీరు విశ్రాంతి తీసుకోవడం మంచిదేమో!

పవన్ కళ్యాణ్, జనసేన నేత:

"వైసీపీ చెయ్యాలనుకుంటే మనస్ఫూర్తిగా సాధ్యం. అది చేయకూడదనుకుంటే మనం ఏమీ చేయలేం".

కామెంట్ : మీరు ఢిల్లీ పోయి మనస్ఫూర్తిగా చేసి ఏమి సాధించారో ప్రజలకు చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పంచన చేరిన మీరు ప్రైవేటీకరణను ఎందుకు ఆపలేదు? ఆపలేనపుడు బీజేపీతో బంధనాలు ఎందుకు తెంచుకోలేదు?

పి.మధు, సీపీయం:

"60, 70 వ దశకాల్లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం కమ్యూనిస్టులు ఎలా పోరాడారో, ప్లాంటు పరిరక్షణ కోసం కూడా అలాగే పోరాడతాం. షేర్ మార్కెట్‌లో స్టీలు ప్లాంటు వాటాల అమ్మకానికీ స్టీల్ ప్లాంట్ భూముల అమ్మకానికీ మేం వ్యతిరేకం. భూముల అమ్మకానికి ప్రత్యామ్నాయంగా స్టీల్ ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి."

కామెంట్ : అదీ అసలు వైఖరి! ప్రజానుకూల వైఖరి! కార్మిక ఐక్యత వర్ధిల్లాలి! ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ విరమించాలి!

Printed, Published & Edited by M.A.Gafoor on behalf of CITU A.P. State Committee from N.P.R. Bhavan, 24-24-14, Rajaka veedhi, Durgapuram, Vijayawada -3, Type setting & Printing at Prajasakti Daily Printing Press, Nulakapeta, Tadepalli, Guntur Dt.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై నిరసన కార్యక్రమాలు





















Karmikalokam 2021 |March, Pages 36, Publishing 2.3.21 Post: Dt. 4,5.3.21, RNI No. APTEL / 1985 / 1324, D/VJ/169/2021-2023

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి,
కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్ ఇవ్వాలి,
ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలి,
చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి
పని ప్రదేశాల్లో లైగింక వేధింపుల నిరోధక కమిటీలకై
ఉద్యమిద్దాం.



ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA101M210
పుస్తకం పేరు	కార్మిక లోకం
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	K Daveed
స్కాన్ చేసినది	DAVEED
పరీక్ష చేసినది	THASIN
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good